ప్రతిపక్షం

www.prathipaksham.in

మంగళవారం 17.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 328 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



శ్రీలంక చేతిలో ఆస్ట్రేలియా ఓటమి 10



నిజామాబాద్ మేయర్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న ఉమారాణి

కార్పోరేషన్లపై కాంగ్రెస్ జెండా

అధికార కాంగ్రెస్ 5, బీజేపీ 1, సీపీఐ 1

నిజామాబాద్‌లో ఎంఐఎంతో కలిసి పీఠం కైవసం

- నల్గొండ తొలి మేయర్‌గా బుర్రి చైతన్య
- ఖాతా తెరవని ప్రతిపక్ష బీఆర్ఎస్
- 72 మున్సిపాలిటీలు హస్తగతం
- 105 మున్సిపాలిటీలలో చైర్మన్, వైఎస్ చైర్మన్ల ఎన్నిక
- 17 బీఆర్ఎస్, 6 బీజేపీ, 3 ఎంఐఎం, 8 ఇతరులు
- 11 మున్సిపాలిటీల్లో చైర్మన్ ఎన్నిక వాయిదా

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 16: కార్పోరేషన్లలో అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధిక చోట్ల పాగా వేసింది. మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్లు, డిప్యూటీ మేయర్లు ఎన్నికయ్యారు. 7 కార్పొరేషన్లలో అధికార కాంగ్రెస్ 5, బీజేపీ 1, సీపీఐ 1 స్థానాల్లో ఎంపిక య్యారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ కార్పొరేషన్లలో ఖాతా తెరవలేదు. మంచిర్యాల, రామగుండం, మహబూబ్‌నగర్, నల్గొండ నగరపాలికల్లో స్పష్టమైన మెజారిటీ ఉండగా ఎంఐఎం మద్దతుతో నిజామాబాద్ పీఠాన్ని కాంగ్రెస్‌దక్కించుకుంది. నిజామాబాద్ లో ఎంఐఎంతో కలిసి అధికార కాంగ్రెస్ మేయర్ పీఠం

...:: మిగతా 2లో

మున్సిపాలిటీలలో కాంగ్రెస్ ప్రభంజనం

- 72 మున్సిపాలిటీలు హస్తగతం
- 105 మున్సిపాలిటీలలో చైర్మన్ల ఎన్నిక
- 17 బీఆర్ఎస్, 6 బీజేపీ, 3 ఎంఐఎం, 8 ఇతరులు

...:: 2లో

లైఫ్ సైన్సెస్ రంగంపై సీఎం రేవంత్ ఫోకస్

గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా హైదరాబాద్



- హైదరాబాద్‌వేదికగా 17న బయో ఏసియా సదస్సు
- 50కి పైగా దేశాల నుండి 4,000 మంది ప్రతినిధులు
- ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 16: తెలంగాణ ప్రభుత్వం లైఫ్ సైన్సెస్ రంగంపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగ దృష్టి సారించారు. ఫిబ్రవరి 17న ప్రపంచస్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక కానుంది. హైటెక్స్ వేదికగా రెండురోజుల పాటు జరిగే సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా హైదరాబాద్ ను మార్చాలని సంకల్పించిన రేవంత్ రెడ్డికి ఈ సదస్సు ప్రాధాన్యత అంశంగా మారింది. ఈ ఏడాది సదస్సును 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' అనే థీమ్ తో నిర్వహిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఆటోమేషన్, లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ రంగాలను ఏ విధంగా ప్రభావితం చేస్తున్నాయి అనే అంశం పైన ఈ సదస్సులో లోతుగా చర్చిస్తారు.

సదస్సుకు విదేశీ నిపుణులు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, అనంతరం సదస్సును ఉద్దేశించి మాట్లాడతారు. ఈ సదస్సులో పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు ప్రపంచవ్యాప్తంగా పేరు ఎన్నికైన ఎక్స్ పర్ట్ లు కూడా పాల్గొంటారు. పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్, ఆమ్జెన్ (యూఎస్ఏ) చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వైచాంగ్ వంటి ప్రముఖులు ముఖ్య అతిథులుగా సదస్సుకు హాజరవుతున్నారు. వీరితో పాటు 50కి పైగా దేశాల నుండి సుమారు 4,000 మంది ప్రతినిధులు, శాస్త్రవేత్తలు మరియు ఫార్మా దిగ్గజాలు ఈ వేదికపై తమ అభిప్రాయాలను, నూతన ఆవిష్కరణలను పంచుకోనున్నారు. ఈ గణనీయమైన భాగస్వామ్యం హైదరాబాద్‌ను ప్రపంచ ఆరోగ్య రంగంలోనే గణనీయమైన మార్పులకు కేంద్రంగా

...:: మిగతా 2లో



దేశ వ్యాప్తంగా సీసీ కెమెరాలు

డ్రగ్స్ రవాణాను అడ్డుకునేందుకు దేశవ్యాప్తంగా పటిష్ఠమైన 'సీసీటీవీ కెమెరాల నెట్‌వర్క్'ను ఏర్పాటు చేయబోతున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. నక్సలిజం సమస్యకు ఈ ఏడాది మార్చి 31 నాటికి శాశ్వతంగా చరమగీతం పాడబోతున్నామన్నారు.

9



ఆలయాల్లో మహిళల ప్రవేశంపై వివక్ష కేసు

కేరళలోని శబరిమల ఆలయంతో సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళల ప్రవేశంపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది.

9

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు




- సన్న వడ్లకు బోనస్ బకాయిలు రూ.514.36 కోట్లు విడుదల
- వానాకాలంలో సన్న వడ్లు అమ్మిన 2.17 లక్షల మంది రైతులకు బోనస్

...:: 3లో

ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్..

భారత్ వేగవంతమైన అభివృద్ధికి నిదర్శనం



- ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో ప్రారంభించిన ప్రధాని మోదీ
- సదస్సుకు హాజరైన 20 దేశాల అధినేతలు

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026 భారత్ వేగవంతమైన అభివృద్ధికి నిదర్శనమని ప్రధాని మోదీ అన్నారు. దిల్లీలో ఏఐ సమ్మిట్ నిర్వహిస్తుండటంపై ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా భారత యువత ప్రతిభ, సామర్థ్యం ప్రపంచ దేశాలకు తెలుస్తాయని ప్రపంచ అభివృద్ధిలో భారత్ తన సహకారాన్ని మరింత పెంచుకునేందుకు ముందడుగు పడుతుందన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. గ్లోబల్ సౌత్ లో నిర్వహిస్తున్న ఈ మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమిట్ భారత్‌లో జరుగుతుండడం గర్వకారణమని ప్రధాని చెప్పారు.

అట్టహాసంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సు

ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సు దిల్లీలో అట్టహాసంగా మొదలైంది. భారత మండపంలో జరుగుతున్న ఈ సదస్సులో ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పోను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు స్టార్టప్‌ల స్టాల్స్‌ను సందర్శించిన మోదీ, ఆయా సంస్థల


...:: మిగతా 2లో



రైతుల కోసం కొత్త ఆవిష్కరణ

ఎరువులు చల్లడం, పురుగుమందుల స్ప్రే చేయడానికి రైతులు చాలా ఇబ్బందులు పడుతుంటారు. ఈ క్రమంలో రైతులకు రైతులకు గేమ్‌చేంజర్‌గా మారే అద్భుత అవిష్కరణను హరియాణాలోని ఓ స్టార్టప్ అభివృద్ధి చేసింది.

9



ఆ పంచాయతీలను తిరిగి ఇవ్వండి

- తెలంగాణలో కలపడానికి సహకరించండి
- తిరుమలలో రాష్ట్రానికి 5 ఎకరాల స్థలం కేటాయించండి విజ్ఞప్తి
- ఖమ్మంలో టీటీడీ దేవస్థానం నిర్మాణానికి సహకరించండి
- తెలుగు రాష్ట్రాల మధ్య సమన్వయంతో సాగుదాం

ప్రతిపక్షం ప్రతినిధి, అమరావతి

ఫిబ్రవరి 16 : రాష్ట్ర పునర్విభజనలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం మండలానికి ఆనుకుని ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అయిదు గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఏపీ సీఎం చంద్రబాబునాయుడును కోరారు. సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పునర్విభజలోని అంశాలతో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన పలు అంశాలపై చంద్రబాబు దృష్టికి

...:: మిగతా 2లో



ఓ నిరుపేద మేయర్.. కాంగ్రెస్ తోనే సాధ్యం

- అర్బన్ ప్రాంతాలలో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి
- నిజామాబాద్ మున్సిపల్ ను రోల్ మోడల్ గా మలుస్తాం
- రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్

ఫిబ్రవరి 16: ఓ సామాన్య కుటుంబానికి చెందిన కార్యకర్త నిజామాబాద్ నగరానికి మేయర్ కావటం సంతోషంగా ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం నిజామాబాద్ మేయర్ ఎన్నిక సమావేశం అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓ నిరుపేదను మేయర్ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే సాధ్యం అయినట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి దేశంలో ఏ రాష్ట్రంలో జరుగలేదని, సీఎం రేవంత్రెడ్డి రెండు సంవత్సరాల ప్రజా పాలనకు రెఫరెండంగా ఈ ఎన్నికల ఫలితాలు నిలిచినట్లు తెలిపారు. రాష్ట్రంలో 80 నుంచి 90 శాతం మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లు గెలుచుకున్నట్లు మంత్రి వెల్లడించారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దేశంలోనే రోల్డ్ మెడల్ గా తీర్చిదిద్దుతామన్నారు. 2005లోనూ తాను ఎన్నికల ఇన్చార్జిగా పనిచేసి కాంగ్రెస్ మేయర్ చేశామని గుర్తు

...:: మిగతా 2లో



రాజస్థాన్ లో అగ్నిప్రమాదం 8 మంది సజీవదహనం

రాజస్థాన్‌లో భివాడిలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదంచోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 8 మంది కార్మికులు సజీవ దహనమయ్యారు.

9

రాజకీయం

లైఫ్ సైన్సెస్ రంగంపై సీఎం రేవంత్ ఫోకస్

మొదటిపేజీ తరువాయి

నిలబెట్టేందుకు దోహదపడుతుంది. రెండు రోజులపాటు లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించి జరిగే ఈ సదస్సులో అనేక కీలక అంశాల పైన చర్చించనున్నారు.

రైజింగ్ 2047 లక్ష్యానికి తగ్గట్టు రోడ్ మ్యాప్

ప్రధానంగా నెక్స్ట్ జనరేషన్ బయో లాజిక్స్, ఔషధ తయారీలో వస్తున్న నూతన మార్పులు, ఏఐ, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, డేటా ఎనలిటిక్స్, ఏఐ సాయంతో రోగనిర్ధారణ, చికిత్స వంటి విషయాలపైన లోతైన విశ్లేషణలు జరుపుతారు. హైదరాబాద్లో ఈ సదస్సు జరగనున్న నేపథ్యంలో తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యానికి తగ్గట్టు రాష్ట్రాన్ని ఒక ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టం గా మార్చడానికి అవసరమైన రోడ్ మ్యాప్ పైన చర్చిస్తారు.

దేశంలోనే అతిపెద్ద టెక్ బయో హబ్ గా

పరిశోధన, కొత్త వ్యాధుల చికిత్సకు అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు, ప్రపంచ ఆరోగ్య ప్రభావం వంటి అనేక అంశాల పైన లోతుగా చర్చిస్తారు. ఈ చర్చల ద్వారా హైదరాబాద్ నగరం ప్రపంచ లైఫ్ సైన్సెస్ రంగంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోనుంది. దేశంలోనే అతి పెద్ద టెక్ బయో హబ్ గా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడం లక్ష్యంగా ఈ సదస్సును ఇక్కడ నిర్వహించడం తెలంగాణాకు లబ్ధిని చేకూర్చనుంది.

ఆ పంచాయతీలను తిరిగి ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి

తీసుకెళ్లారు. ఖమ్మం జిల్లాకు సంబంధిచిన సాగునీటి వసతులు, భక్తులు మరియు ప్రజల సౌకర్యానికి సంబంధించిన పలు కీలక విజ్ఞప్తులు చేసారు. వివరించారు. యేటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్త పట్నం, గుండాల గ్రామపంచాయతీలు భౌగోళికంగా తెలంగాణ ప్రాంతాల మధ్యలో ఉండటం వల్ల ప్రజలు పరిపాలనా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ గ్రామాలు గోదావరి నది, అటవీ ప్రాంతాల మధ్య ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎంక్లేవ్‌లా మారిపోయాయని, జిల్లా కేంద్రాలకు చేరుకోవడానికి ప్రజలు దాదాపు 8 గంటలు ప్రయాణించాల్సి వస్తోందని మంత్రి పేర్కొన్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, పన్నులు, పరిపాలనా అనుసంధానం లోపం, భద్రతా సమస్యలు వంటి అంశాలు స్థానిక గిరిజన ప్రజల జీవన విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయని వివరించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి సంబంధించిన భూభాగాల్లో కొంత భాగం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉండటం వల్ల దేవస్థానం పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, భక్తులకు మెరుగైన సేవలు అందించాలంటే ఈ గ్రామాల విలీనం అవసరమని మంత్రి అభిప్రాయపడ్డారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ఈ చర్య కీలకమని తెలిపారు. అదే విధంగా, ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు సాగునీటి ప్రాజెక్ట్ శాశ్వత మరమ్మత్తులు అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 16,000 ఎకరాలకు సాగునీరు అందుతుండగా, అందులో సుమారు 13,640 ఎకరాలు (85.25%) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, 2,360 ఎకరాలు (14.75%) తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి అని తెలిపారు. ప్రాజెక్ట్ శాశ్వత పునరుద్ధరణకు సుమారు రూ.92.20 కోట్ల వ్యయం అంచనా వేయబడిందని, రెండు రాష్ట్రాలకు లబ్ధి చేకూరుతున్న నేపథ్యంలో ఖర్చును 85:15 నిష్పత్తిలో భరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సాగు, జీవనాధారం ఈ ప్రాజెక్ట్‌పై ఆధారపడి ఉన్నందున తక్షణ ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ పరిధిలో గోదావరి వరద రక్షణ కరకట్టలోని 3వ స్లూయిస్ వద్ద గోడ దెబ్బతిన్న విషయం కూడా మంత్రి ప్రస్తావించారు. భద్రాచలం పట్టణాన్ని వరదల నుంచి రక్షించేందుకు నిర్మించిన ఈ రక్షణ గోడలో జరిగిన ఈ నష్టం భవిష్యత్తులో భారీ ప్రమాదానికి దారితీయొచ్చని పేర్కొన్నారు. కరకట్టలోని ఆ భాగం విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వెళ్లడంతో నిర్వహణలో సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే తెలంగాణ ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదని మంత్రి తెలిపారు. తక్షణ సాంకేతిక పరిశీలన చేసి తాత్కాలిక రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు, రెండు రాష్ట్రాల సమన్వయంతో శాశ్వత పునరుద్ధరణ చర్యలు ప్రారంభించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఏపీ సీఎం చంద్రబాబును కోరారు.

తిరుమలలో 5 ఎకరాల
భూమి కేటాయించాలని

తిరుమలలో తెలంగాణ భక్తుల కోసం ప్రత్యేక యాత్రికుల భవనం నిర్మాణానికి సుమారు 5 ఎకరాల భూమి కేటాయించాలని మంత్రి ప్రతిపాదించారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో వసతి కొరతను తగ్గించి భక్తులకు సౌకర్యవంతమైన దర్శన అనుభవం కల్పించేందుకు ఈ ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందని తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, సమన్వయం పెంపొందిస్తే సాగునీరు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాలు మరియు మౌలిక వసతుల విస్తరణలో వేగవంతమైన పురోగతి సాధ్యమవుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు పేర్కొన్నారు. సత్తుపల్లి కొవ్వూరు రైల్వే లైన్, పెనుబల్లి అమరావతి రైల్వే లైన్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓ నిరుపేద మేయర్.. కాంగ్రెస్ తోనే సాధ్యం

మొదటిపేజీ తరువాయి

చేశారు. ఈ ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఎన్నో పిచ్చిపట్టినట్లు మాట్లాడారు. అయిన ప్రజలు తమ అభివృద్ధి పనులను చూసి ఓట్లేసి గెలిపించారు. మా మంత్రివర్గం 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండి ఎన్నో సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. అర్బన్ ప్రాంతాలలో పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి చేయబోతున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి పనులను పీసీసీ మహేష్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచనలతో చేస్తామన్నారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న ఇరిగేషన్ పనులను యుద్ధప్రతిపాదికన చేపట్టి పూర్తి చేయనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

మతం పేరుతో రెచ్చగొట్టినా
అభివృద్ధి వైపే ప్రజలు: పీసీసీ చీఫ్‌మహేష్

మున్సిపల్ ఎన్నికల్లో మతం పేరుతో రెచ్చగొట్టే ప్రసంగాలు, ప్రజలను మభ్యపెట్టిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ అభివృద్ధి పనుల వైపు మొగ్గుచూపారని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ నగరంలో ఎంఐఎం పార్టీతో పొత్తు పెట్టుకోకుండా పోటి చేసి 5 సీట్లు గెలిచామన్నారు. అలాగే 7 స్థానాలలో సెంటిమెంట్లు ఉసిగొల్పటంతో 7 స్థానాలు ఓడిపోయినట్లు తెలిపారు. ఎట్టకేలకు 15 సంవత్సరాల అనంతరం మళ్లీ మేయర్ పీఠంపై కాంగ్రెస్ పార్టీ కూర్చొంది. ఇప్పుడిక నగర అభివృద్ధి కొరకు తీవ్రంగా కృషిచేస్తామన్నారు. నగర మేయర్ గా పదవి చేపట్టిన ఉమారాణి ను పీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ సలహాదారు పి సుదర్శన్రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డిలు అభినంధించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ సభ్యుడు గడుగు గంగాధర నుడా చైర్మన్ కేశ వేణు, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మార్కెట్ కమిటి చైర్మన్ ముప్పా గంగారెడ్డి, నూతనంగా గెలిచిన కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ఎంతకాలం వేధింపులు భరించగలం

- ఈ వేధింపులు భరిస్తూ పార్టీలో కొనసాగగలుగుతామా?
- మా కాంగ్రెస్ కార్యకర్తల హక్కులను కాపాడలేకపోతున్నా
- ఆయన ఎవరో వచ్చి మా మీద ఆధిపత్యం చెలాయిస్తున్నారు
- మున్సిపల్ చైర్ పర్సన్ గా సంజయ్ వర్గానికి చెందిన వ్యక్తి
- కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అసంతృప్తి

ప్రతిపక్షం ప్రతినిధి, కరీంనగర్, ఫిబ్రవరి 16: జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపిక విషయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మళ్లీ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ప్రతిపాదనను కాదని, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి అధిష్టానం ప్రాధాన్యత ఇవ్వడంతో ఆయన కలత చెందారు. తన వర్గానికి చెందిన వ్యక్తికి కాకుండా.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన సమిండ్ల వాణిని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎంపిక చేయడాన్ని ఆయన అవమానంగా భావిస్తున్నారు. సోమవారం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..'నా గురించి, పార్టీతో నాకు ఉన్న అనుబంధం గురించి మీకు తెలుసు. పార్టీలో కొనసాగాలనే విషయంపై ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయన ఎవరో వచ్చి మా మీద ఆధిపత్యం చెలాయిస్తున్నారు. మా హక్కులను కాలరాస్తున్నారు. మా కాంగ్రెస్ కార్యకర్తల హక్కులను కాపాడలేకపోతున్నా. ఈ క్షోభ ముగింపు కాదు. ఈ వేధింపులు భరిస్తూ పార్టీలో కొనసాగగలుగుతామా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ వేధింపులు భరించగలుగుతానా? ఎంత కాలం భరించగలుగుతాను? దీనికి పరిష్కారం ఏంటి? అని కూడా ఊహించలేకపోతున్నా' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ సవాంగ్ ఇరు వర్గాల నేతలతో జరిపిన చర్చలు జరిపారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డితో విడివిడిగా, అనంతరం కలిసి చర్చలు జరిపారు. పార్టీ అంతర్గత విషయాలను రోడ్డుపైకి తీసుకురావడం వల్ల కేడర్‌లో అయోమయం నెలకొంటుందని ఆయన సున్నితంగా హెచ్చరించారు. క్రమశిక్షణే ముఖ్యమని, పార్టీ తీసుకునే తుది నిర్ణయానికి ఇరువురు నేతలు కట్టుబడి ఉండాలని సవాంగ్ స్పష్టం చేశారు. అయినా మళ్లీ జగిత్యాల కాంగ్రెస్‌లో విభేదాలు తలెత్తాయి.

కార్పోరేషన్లపై కాంగ్రెస్ జెండా

మొదటిపేజీ తరువాయి

కైవసం చేసుకుంది. నిజామాబాద్ మేయర్‌గా ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ ఎంపికయ్యారు. నల్గొండ నగరపాలక సంస్థ కాంగ్రెస్ దక్కించుకుంది. తొలి మేయర్‌గా బుర్రి చైతన్య నియమితులయ్యారు. డిప్యూటీ మేయర్ పదవి మహ్మద్ అశ్రఫ్ అలీని వరించింది. మంచిర్యాల కార్పొరేషన్ కాంగ్రెస్ కైవసం అయింది. మేయర్‌గా ధర్ని మధు, డిప్యూటీ మేయర్‌గా రమ్య ఎంపికయ్యారు. కొత్తగూడెం మేయర్ స్థానాన్ని సీపీఐ దక్కించుకుంది. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా ఆవిర్భవించిన తర్వాత జరిగిన ఎన్నికల్లో కొత్తగూడెం కార్పొరేషన్‌ను సీపీఐ కైవసం చేసుకుంది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో మేయర్ పదవి సీపీఐకి దక్కగా డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్ దక్కించుకుంది. మేయర్‌గా మూడ్ గణేశ్, డిప్యూటీ మేయర్‌గా లలితకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్‌గా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన గుముల మమత ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్ పదవి మారేపల్లి సురేందర్ రెడ్డిని వరించింది. రామగుండం కార్పొరేషన్ మేయర్‌గా కాంగ్రెస్ మద్దతుదారుడు మహంకాళి స్వామి ప్రమాణ స్వీకారం చేశారు. డిప్యూటీ మేయర్‌గా ఎల్లయ్యను ఎన్నుకున్నారు.

బీజేపీ ఖాతాలో కరీంనగర్

నాటకీయ పరిణామాల మధ్య కరీంనగర్ మేయర్ పీఠం ఎట్టకేలకు బీజేపీ కైవసం చేసుకుంది. మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో మేయర్ పీఠాన్ని ఆ పార్టీ దక్కించుకుంది. డిప్యూటీ మేయర్‌గా చెందిన సునీల్ రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ప్రకటించారు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని దక్కించుకోవడంలో కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. మేయర్ పదవికి పోటీ పడ్డ కాంగ్రెస్ అభ్యర్థికి 21 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ తటస్థంగా వ్యవహరించింది.

కాంగ్రెస్ దక్కించుకున్న కార్పొరేషన్లు

నిజామాబాద్, మంచిర్యాల, మహబూబ్‌నగర్, రామగుండం, నల్గొండ

బీజేపీ : కరీంనగర్, సీపీఐ: కొత్తగూడెం

మున్సిపాలిటీలలో కాంగ్రెస్ ప్రభంజనం

- 72 మున్సిపాలిటీలు హస్తగతం
- 105 మున్సిపాలిటీలలో చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక
- 17 బీఆర్ఎస్, 6 బీజేపీ, 3 ఎంఐఎం, 8 ఇతరులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 16: మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. సోమవారం 105 మున్సిపాలిటీలు చైర్మన్, వైస్ చైర్మన్, మేయర్ డిప్యూటీ మేయర్ ఎన్నికలను అధికారులు నిర్వహించారు. ఇందులో 78 మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ 17, బీజేపీ 6, ఎంఐఎం 3, ఇతరులు 8 మున్సిపాలిటీలలో జెండా ఎగురవేశారు. ఇతరుల్లో ఫార్వర్డ్ బ్లాక్ తో పాటు స్వతంత్రులు ఎంపికయ్యారు.

11 మున్సిపాలిటీల్లో చైర్మన్ ఎన్నిక వాయిదా

రాష్ట్రంలో మున్కసిపల్‌చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా పలు చోట్ల తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు మధ్య తోపులాట చోటు చేసుకున్నాయి. మరికొన్నిచోట్ల ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఉద్రిక్తతలు, ఇతర కారణాలతో తెలంగాణ వ్యాప్తంగా 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా పడింది.. తొర్రూర్, ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నాకల్, జనగాంలో చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీలో చైర్మన్ ఎన్నిక సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తొర్రూరులో 16 వార్డులు ఉండగా బీఆర్ఎస్ 9, కాంగ్రెస్ 7 గెలుచుకున్నాయి. దీంతో ఎక్స్ అఫీషియో ఓట్లు కీలకంగా మారాయి. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఎక్స్‌అఫీషియో ఓట్లతో బలాబలాలు సమానమయ్యాయి. ఈ నేపథ్యంలో కడియం కావ్య ఓటుపై అభ్యంతరం చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. వరంగల్‌లో ఎక్స్‌అఫీషియో సభ్యురాలిగా కావ్య పేరు ఉందని ఆరోపిస్తూ మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు ఒకరికొకరు పోటాపోటీగా నినాదాలు చేసుకున్నారు. ఒక దశలో ఇరువర్గాల వాళ్లు దాడి చేసుకునేంత పరిస్థితి వచ్చింది.

ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తత

ఇబ్రంహీపట్నం మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత కొనసాగింది. మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నేటికి వాయిదా పడటంతో ఆందోళన నెలకొంది. కాంగ్రెస్., బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. కోరం లేకపోవడంతో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మున్సిపల్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం సైతం నేటికి వాయిదా పడింది. ప్రమాణస్వీకారానికి 21 మంది సభ్యులు హాజరుకాకపోవడంతో వాయిదా వేశారు. పేర్లు ఖరారు కాకపోవడంతో... పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రేపటికి వాయిదా పడింది. చైర్మన్, వైస్‌చైర్మన్ పేర్లను పార్టీలు ఖరారు చేయకపోవడంతో ఎన్నిక వాయిదా వేశారు. సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేటికి వాయిదా పడింది. కోరం లేనందున ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. చౌటుప్పల్ 13వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలిచిన బత్తుల వాణి మున్సిపల్ చైర్ పర్సన్ ఇస్తారని భావించారు. చివరి క్షణంలో మరొక అభ్యర్థి పావనికి చైర్ పర్సన్ ఇస్తున్నారని తెలిసి బత్తుల వాణి మద్దతుదారులు ఆందోళనకు దిగారు. స్థానికేతరులకు చైర్ పర్సన్ పదవీ ఎలా ఇస్తారని ఆందోళన చేపట్టారు.

ప్రమాణ స్వీకారోత్సవంలో రసాభాస

సిరిసిల్ల మున్సిపల్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో రసాభాస నెలకొంది. సిరిసిల్ల వైస్‌చైర్మన్‌గా బుర్రా నారాయణ పేరును మాజీ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. సీల్డ్ కవర్‌లో బుర్రా నారాయణ పేరు లేకపోవడంతో బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహానికి గురయ్యారు. సీల్డ్ కవర్‌లో చైర్మన్‌గా కళాచక్రపాణి, వైస్‌చైర్మన్‌గా సందీప్ పేర్లు ఉన్నట్లు సమాచారం అందడంతో శ్రేణులు ఆందోళనకు దిగాయి. జనగామ పురపాలికలో రాజకీయాలు ఉత్కంఠ నెలకొంది. జనగామలో 30 వార్డులకుగానూ మిత్రమైన పక్షమైన సీపీఎం గెల్చుకున్న ఒకవార్డుతో కలిసి కాంగ్రెస్ కూటమికి 13 వార్డులు దక్కగా విపక్ష బీఆర్ఎస్ కూడా అంతే సమానంగా 13 వార్డులు గెలుచుకుంది. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి , సిట్టింగ్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఓటు నమోదు చేసుకోతో ఇరుపార్టీలు మళ్లీ చెరో 14 ఓట్లతో సమంగా ఉన్నాయి. దీంతో జనగామ చైర్మన్ పీఠం కైవసం చేసుకోవడంలో స్వతంత్రులే కీలకంగా మారారు. ప్రమాణస్వీకారం క్యాంపుల నుంచి జనగామ మున్సిపల్ కేంద్రం వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ కౌన్సిలర్ల వాహనాల్ని పోలీసులు అడ్డుకున్నారు. 28వ వార్డు కౌన్సిలర్‌ను కిడ్నాప్ చేశారని ఆమె మరిది కంప్లైంట్ మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చెప్పిన డీసీపీ ఆమెను వదిలి వెళ్లాలని కోరారు. ఈ నేపథ్యంలో డీసీపీకి పల్లాకు మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు అక్కడ ఎన్నికను వాయిదా వేశారు.

క్యాతనపల్లి మున్సిపల్
ఆఫీసు వద్ద ఉద్రిక్తత

మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసు వద్ద ఉద్రిక్తత నెలకొంది. అభ్యర్థులతో కలిసి వచ్చిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌ను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. దీంతో అభ్యర్థులతో కలిసి బాల్క సుమన్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అప్పుడే.. మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులు సుమన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోరం లేక చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికను నేటికి వాయిదా వేసినట్టు అధికారులు వెల్లడించారు.

ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్..

భారత్ వేగవంతమైన అభివృద్ధికి నిదర్శనం



మొదటిపేజీ తరువాయి

ప్రతినిధులతో ముచ్చటించారు. ఈ ఎక్స్‌పోలో 600కుపైగా హైపొటెన్షియల్ స్టార్టప్‌లు కొలువుదీరాయి. 13 దేశాల పెవిలియన్లు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. ఈనెల 20 వరకూ జరగనున్న ఈ సదస్సులో పాల్గొనేందుకు భారీ సంఖ్యలో డెలిగేట్స్ భారత్ మండపానికి తరలివచ్చారు. ఎటు చూసినా టెక్ ప్రియులే. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ కంపెనీల ప్రతినిధుల నుంచి మొదలుకొని, కళాశాల విద్యార్థుల వరకు అందరూ ఈ చారిత్రాత్మక ఘట్టంలో భాగం కావడానికి పోటీపడ్డారు. ఈ సదస్సులో ప్రధాన ఆకర్షణగా నిలవాల్సిన గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, ఓపెన్ ఏఐ బాస్ సామ్ ఆల్ట్‌మన్ వంటి వారు ఇంకా భారత్ రాలేదు. వారి సెషన్లు బుధవారం మొదలవుతాయి. అయినప్పటికీ తొలిరోజే ఈ స్థాయి స్పందన రావడం ఏఐ పట్ల ప్రజల్లో ఉన్న ఆసక్తిని తెలియజేస్తోంది. ఈనెల 19, 20 తేదీల్లో ప్రధాని మోదీతోపాటు, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో సదస్సులో పాల్గొంటారు. వీరితో పాటు సుమారు 20 దేశాల అధినేతలు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దిశానిర్దేశం ఎలా ఉండాలి, ప్రభుత్వాలు దీనిని ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై వీరు చర్చించనున్నారు. భారత్ ఈ సదస్సు ద్వారా ప్రపంచానికి ఒక కీలక సందేశం ఇవ్వాలని భావిస్తోంది. ఏఐ అనేది కేవలం ధనిక దేశాలకే పరిమితం కాకూడదని, గ్లోబల్ సౌత్ అని పిలిచే అభివృద్ధి చెందుతున్న దేశాలకు కూడా ఈ టెక్నాలజీ ఫలాలు అందాలని భారత్ బలంగా వాదిస్తోంది. గ్లోబల్ ఏఐ కామన్స్ పేరుతో ఒక ఉమ్మడి వేదికను ఏర్పాటు చేసి, వ్యవసాయం, ఆరోగ్యం వంటి కీలక రంగాల్లో ఏఐని అందరికీ అందుబాటులోకి తేవాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. త్వరలోనే క్రియేట్ ఇన్ ఇండియా మిషన్‌ను ప్రారంభించబోతున్నాం. సెమీకండక్టర్ మిషన్ మాదిరే క్రియేట్ ఇన్ ఇండియా మిషన్ కూడా పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా, ఉపాధి కల్పన, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రూపొందించాం. ఈ మిషన్ ప్రస్తుతం ఉన్న సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుంది. ఏదైనా వస్తువును రూపొందించాలంటే అందుకు భారత్‌ను వేదికగా ఎంచుకునేలా ఉంటుంది. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టు ప్రతిభావంతులైన నిపుణులను తయారు చేస్తుంది. అది రాబోయే 25 ఏళ్ల పాటు వృద్ధిని కొనసాగిస్తుంది.

పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యత

- వెన్నుపోటు రాజకీయాలు సహించం
- ములుగులో మంత్రి సీతక్క హెచ్చరిక
- నల్లెల కుమార్ కు మంచి అవకాశాలు వస్తాయి
- ములుగు మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్ల సన్మాన సభలో మంత్రి సీతక్క



ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, ఫిబ్రవరి 16: పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తామని, వెన్నుపోటు రాజకీయాలు సహించేది లేదని మంత్రి సీతక్క అన్నారు. ములుగు మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి సన్మాన కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. కాంగ్రెస్ తరపున గెలిచిన కౌన్సిలర్లందరినీ శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి సీతక్క ప్రసంగించారు. ములుగు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రతి కార్యకర్తకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చింతనిప్పుల చంద్రకళ బిక్షపతిని ఎన్నుకున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరికీ చైర్‌పర్సన్ కావాలనే ఆశ ఉంటుంది కానీ అవకాశం ఒక్కరికి మాత్రమే దక్కుతుందని స్పష్టం చేశారు. సీనియర్ అనుభవం కలిగిన నాయకుడిగా, ములుగు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న చింతనిప్పుల బిక్షపతికి ఈ అవకాశం కల్పించామని తెలిపారు. గతంలో ఎన్నో ఒత్తిడులు వచ్చినప్పటికీ పార్టీ మారకుండా నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. పార్టీ కార్యకర్తల అభిష్టం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ములుగు మున్సిపాలిటీ సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడు బిక్షపతి అని అన్నారు. అవకాశం రానివారు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, భవిష్యత్తులో మంచి అవకాశాలు అందరికీ వస్తాయని భరోసా ఇచ్చారు. ములుగు మున్సిపాలిటీలో నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోవడానికి వెన్నుపోటు రాజకీయాలే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీలో ఉండి మోసం చేయడం క్షమించరాని నేరమని, అలాంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. ఎవరు వెన్నుపోటు రాజకీయాలు చేశారో తమకు తెలుసని, పద్ధతి మార్చుకోవాలని ఇది చివరి హెచ్చరిక అని అన్నారు. ములుగు జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లెల కుమార్‌ను అన్నలాంటివారని పేర్కొంటూ, ఆయన కుమారుడు నల్లెల భరత్‌కు ఇంకా వయసు ఉందని, భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయని తెలిపారు. తమను ఓడించేందుకు రియల్ ఎస్టేట్ మాఫియా కోట్లు కుమ్మరించినప్పటికీ ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కట్టారని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అన్ని అంశాలను ఆలోచించి, పార్టీ ప్రయోజనాల దృష్ట్యా బిక్షపతికి అవకాశం ఇచ్చామని తెలిపారు. అన్ని ఎన్నికల్లో కార్యకర్తలు సమిష్టిగా పనిచేస్తే విజయం ఖాయం అని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.



నేను కలిసిన ప్రపంచ నేతలతో పోలిస్తే చంద్రబాబువి విజనరీ ఆలోచనలు ఈ విషయాన్ని చంద్రబాబుతో జరిగిన తొలి భేటీలోనే గ్రహించాను. ఆయన ఐటీని ప్రమోట్ చేయడం వల్లే హైదరాబాద్ నుంచి నిపుణులు తయారయ్యారు. డిజిటల్ విప్లవంలో మోదీ, చంద్రబాబు కీలకపాత్ర పోషిస్తున్నారు. విద్యార్థులకు సరైన విద్యాబోధన చేయడానికి ఏఐ తోడ్పడుతుంది. వ్యవసాయంలో ఏఐ వాడుక మంచి పరిణామం.

- బిల్ గేట్స్



రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు

- సన్న వడ్లకు బోనస్ బకాయిలు రూ.514.36 కోట్లు విడుదల
- వానాకాలంలో సన్న వడ్లు అమ్మిన 2.17 లక్షల మంది రైతులకు బోనస్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 16 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు తీపి కబురు అందించింది. గత ఖరీఫ్ సీజన్ సంబంధించి పెండింగ్ వరి సన్న రకాల బోనస్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో సన్న రకాల వరి పంట సాగు చేసిన అన్నదాతలకు క్వింటాల్ ధరపై 500 రూపాయల బోనస్ కోసం 514.36 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఈ మేరకు ఆర్థిక కేటాయింపులు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ కీలకమైన పంపిణీ రాష్ట్రవ్యాప్తంగా 202526 ఖరీఫ్ సీజన్‌లో సన్న రకాల వరి పంట సాగు చేసిన 2.17 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ నిధుల విడుదలతో పాటు పౌర సరఫరాల సంస్థ వరి బోనస్ కోసం ఇప్పటికే 1939.58 కోట్ల రూపాయలు ప్రాసెస్ చేసి అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అనూహ్య వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి వనరులు పుష్కలంగా ఉండటం, కీలక వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చే క్రమంలో పంట సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వరి ఒక క్వింటా ధరపై 500 రూపాయలు అదనపు బోనస్ ఇస్తుండటంతో సన్న రకాల సాగు గణనీయంగా పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన "ఏ" గ్రేడు ధాన్యం క్వింటాల్ కనీస మద్దతు ధర 2,389 రూపాయలు కంటే బోనస్ 500 రూపాయలు అదనం. ఈ పెండింగ్ బకాయిలు చెల్లించడం వల్ల రైతులకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానం మేరకు రైతుల కృషికి తగిన ప్రతిఫలం ఇవ్వడం ద్వారా ప్రభుత్వం అంకితభావం మరింత బలపడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లుగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. సంఖ్యకు పరిమితం చేయకుండా అర్హులైన వారందరికీ తమ ప్రభుత్వం రేషన్ కార్డులు అందజేసిందని పేర్కొన్నారు. జనాభాలో 85శాతం మందికి రేషన్ కార్డులు ఇచ్చి వారికి 6 కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. ఇంకా ఎవరైన అర్హత ఉన్నవారు ఉన్నట్లయితే వారికి కూడా ఇస్తామన్నారు. ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం లాంటివి అమలు చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని పేర్కొన్నారు.



హుస్నాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రతిపక్షం,హుస్నాబాద్, ఫిబ్రవరి 16: హుస్నాబాద్ మున్సిపాలిటీని సర్వతోముఖాభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే ఒక మోడల్ మున్సిపాలిటీగా రూపొందిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మలను ఆయన మర్యాదపూర్వకంగా వారి కుర్చీల్లో కూర్చుండబెట్టి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, హుస్నాబాద్ ప్రజలు అభివృద్ధిని కాంక్షించి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులను గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల అనంతరం పార్టీలకతీతంగా హుస్నాబాద్ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. హుస్నాబాద్ చుట్టుపక్కల ఉన్న నాలుగు జిల్లా కేంద్రాలకు దీటుగా ఇక్కడి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని, ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల వంటి మౌలిక అవసరాల విషయంలో కొత్త పాలకవర్గం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. పట్టణం అభివృద్ధి చెందితేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, అందువల్ల విద్య, వైద్యం మరియు ఉపాధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే తమ లక్ష్యమని మంత్రి వివరించారు. కొత్త పాలకవర్గానికి శాసనసభ్యుడిగా తాను ఎల్లవేళలా అండగా ఉంటానని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే దిశగా ప్రతి అంశంలోనూ ఈ కొత్త టీమ్ ముందుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు మరియు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



షాద్నగర్ మున్సిపల్ చైర్మన్‌గా బస్వం విజయం

- వైస్ చైర్మన్‌గా అందె మోహన్ ఏకగ్రీవం

ప్రతిపక్షం, షాద్‌నగర్, ఫిబ్రవరి 16: షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం చాటుకుంది. కాంగ్రెస్ కౌన్సిలర్ అగ్గనూరు బస్వం 16 ఓట్లు సాధించి చైర్మన్‌గా విజయం సాధించారు. ఎక్స్ ఆఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే శంకర్ మద్దతు ప్రకటించడంతో కాంగ్రెస్ అభ్యర్థికి స్పష్టమైన మెజారిటీ లభించింది. బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన కౌన్సిలర్ లక్ష్మి ప్రసన్నకు 12 ఓట్లు లభించాయి. ఆమెకు ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి మద్దతు పలికారు. అయినప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి అగ్గనూరు బస్వంకు అధిక ఓట్లు రావడంతో ఎన్నికల అధికారి, ఆర్‌డీఓ అధికారికంగా ఆయనను చైర్మన్‌గా ప్రకటించారు. ఇదిలా ఉండగా, వైస్ చైర్మన్ పదవికి అందె మోహన్ పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో మున్సిపల్ పాలనలో కాంగ్రెస్ పార్టీ పూర్తి ఆధిపత్యం సాధించింది. వైస్ చైర్మన్‌గా ఎన్నికైన అందె మోహన్ కూడా అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యత ఇస్తూ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

ఇంటింటికీ హైస్పీడ్ ఇంటర్నెట్

- తెలంగాణ ఫైబర్ గ్రిడ్ ద్వారా డిజిటల్ సేవలు
- కేవలం రూ.300కే అందుబాటులోకి



ప్రతిపక్షం, హైదరాబాద్, ఫిబ్రవరి 16: తెలంగాణ ఫైబర్ గ్రిడ్ ద్వారా డిజిటల్ సేవలు త్వరలో అత్యంత మారుమూల గ్రామాలకు కూడా చేరనున్నాయి. ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఓటీటీ సేవలు కేవలం రూ.300కే అందుబాటులోకి రానున్నాయి. రెండేళ్లలో కోటి ఇళ్లకు చేరువ కావాలనే లక్ష్యంతో, రాబోయే ఆరు నెలల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్‌తో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. తెలంగాణ అంతటా త్వరలో గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ విస్తరిస్తుందని అధికారులు తెలిపారు. నగరాలకే పరిమితమైన హైస్పీడ్ ఇంటర్నెట్, త్వరలో మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి చేరుకుంటుంది. ప్రజలకు సరసమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టును వేగవంతం చేస్తోంది. రాబోయే 6 నుండి 12 నెలల్లో, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటికి హైస్పీడ్ ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వం గృహాల కోసం సెట్ టాప్ బాక్స్‌లు ప్రత్యేక డేటా ప్లాన్‌లను కూడా సిద్ధం చేస్తోంది. ఎంపిక చేసిన నాలుగు గ్రామాల్లో ఇప్పటికే ఒక పైలట్ ప్రాజెక్ట్ విజయవంతంగా అమలు చేస్తున్నారు. రెండేళ్లలోపు రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను విస్తరించడమే లక్ష్యం. ప్రాథమిక ప్రణాళిక ప్రకారం, కేబుల్ టీవీ, ఇంటర్నెట్, డజన్ల కొద్దీ ప్రభుత్వ సేవలు ఒకే ప్లాట్‌ఫామ్ కింద కేవలం రూజ300కే అందిస్తారు. అవసరమైతే ప్రతి ఇంటికి 1 జీబీపీఎస్ వరకు వేగాన్ని అందించడానికి కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలంగాణ ఫైబర్ గ్రిడ్ ఇంటి ఇంటర్నెట్ లేదా మొబైల్ డేటా వినియోగానికి మాత్రమే పరిమితం కాదు. ప్రభుత్వం అందించే ఒకే సెట్‌టాప్ బాక్స్‌తో, టీవీ కంప్యూటర్ లేదా డిజిటల్ సర్వీస్ సెంటర్ లాగా పనిచేస్తుంది. ఓటీటీ ప్లాట్‌ఫాంలతో పాటు 50కు పైగా సేవలు ఇంటి నుండే అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు యూట్యూబ్ తరగతులకు హాజరు కావచ్చు ప్రజలు తమ టీవీ ద్వారా వైద్య సేవలను పొందవచ్చు. వర్చువల్ డెస్క్‌టాప్ ఫీచర్‌తో, టీవీ కంప్యూటర్ లాగా పనిచేస్తుంది. మొబైల్ సిగ్నల్స్ తక్కువగా ఉన్న ప్రాంతాలలో కూడా, ఇంటర్నెట్ ఆధారిత ఫోన్ కాల్స్ చేయవచ్చు. విద్యార్థులు, రైతులు, సాధారణ ప్రజలు తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా ప్రభుత్వ సేవలను త్వరగా యాక్సెస్ చేయొచ్చు.ఈ డిజిటల్ గ్రిడ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మారుస్తుందని నిపుణులు విశ్వసిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ ఆధారిత ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి, యువత తమ స్వస్థలాల నుండి ఐటీ ఉద్యోగాలలో పనిచేయడానికి వీలు కల్పిస్తుంది.



తెలంగాణ జాగృతిలో చేరిన కావేటి మనోహర్

- కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించిన కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 16: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే కావేటి సమయ్య కుమారుడు కావేటి మనోహర్ కుమార్ తెలంగాణ జాగృతిలో చేరారు. సోమవారం మనోహర్ కుమార్‌కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు ఆయన సతీమణి కావేటి సబిత, అనుచరులు కూడా జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా కావేటి మనోహర్ మాట్లాడుతూ తెలంగాణ జాగృతిలో చేరడం సంతోషంగా ఉందని తెలిపారు. ముఖ్యంగా సామాజిక తెలంగాణ, సామాజిక న్యాయం సాధన కోసం పోరాటం చేస్తున్న కల్వకుంట్ల కవితకు మద్దతునివ్వడం కోసం జాగృతిలో చేరానని స్పష్టం చేశారు. తెలంగాణలో అన్ని వర్గాల అభివృద్ధి కవితతోనే సాధ్యమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నూతన రాజకీయ పంథాను అవలంబిస్తూ యువతకు ప్రాధాన్యత ఇస్తున్న కవితకు ప్రజల్లో మరింత ఆధరణ లభిస్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతిని బలోపేతం చేయడానికి తాను పని చేస్తానని స్పష్టం చేశారు.

కాంగ్రెస్, బీజేపీ అపవిత్ర పొత్తు

- బహిర్గతమైన "ఫెవికాల్ బంధం"
- బీఆర్ఎస్‌ను అడ్డుకోవడమే లక్ష్యం
- సిద్ధాంతాలను పక్కనపెట్టి కలయిక
- మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 16: తెలంగాణలో అధికారం కోసం జెండాలు, అజెండాలను పక్కనపెట్టి అధికార పీఠం కోసం ఎంతలా దిగజార్చవచ్చో కాంగ్రెస్, బీజేపీలు నేడు నిరూపించాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత టి. హరీష్ రావు విమర్శించారు. మార్పు పేరుతో బీజేపీతో జతకట్టడమేనా అంటూ ఆయన ప్రశ్నించారు. గత 12 ఏండ్లుగా బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి బీటీమ్ అని, కాంగ్రెస్‌కు బీ టీమ్ అని పరస్పరం విమర్శించుకున్న ఆ రెండు పార్టీలు ఇప్పుడు తెలంగాణ వ్యతిరేక టీమ్‌గా మారాయని ఆయన ఆరోపించారు. ఈ అపవిత్ర కలయికను ప్రజలు గమనించారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఫలితాల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీల మధ్య ఉన్న "ఫెవికాల్ బంధం" మరోసారి బహిర్గతమైందని తెలిపారు. బీఆర్ఎస్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ రెండు పార్టీలు సిద్ధాంతాలను పక్కనపెట్టి చేతులు కలుపుతున్నాయని విమర్శించారు. అలియాబాద్, అమన్‌గల్, మెదక్, నర్సాపూర్ వంటి ప్రాంతాల ఫలితాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఢిల్లీలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ, గల్లీలో మాత్రం కలిసి పదవులు పంచుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కారునా, బీజేపీ సర్కారునా నడుపుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఒంటరిగా బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే సత్తా లేక బీజేపీతో కుమ్మక్కైందని అన్నారు. ఒకవైపు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా బీజేపీపై పోరాటం చేస్తుండగా, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ బీజేపీతో పొత్తులు పెట్టుకోవడం విరుద్ధ ధోరణి కాదా అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్లను కూడా ఆయన సూటిగా ప్రశ్నించారు. మున్సిపాలిటీల్లో చైర్మన్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌తో బీజేపీ కలిసిన విషయం తెలిసే చేశారా అని నిలదీశారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో చైర్మన్ పదవి కాంగ్రెస్ తీసుకుని, వైస్ చైర్మన్ పదవి బీజేపీకి ఇచ్చారని ఆరోపించారు. సిర్పూర్ కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ, కాంగ్రెస్, బీజేపీలు కలిసి అధికారాన్ని చేజిక్కించుకున్నాయని అన్నారు. అలియాబాద్‌లో బీజేపీ మద్దతుతో కాంగ్రెస్ చైర్మన్ పదవి దక్కించుకుందని, మెట్‌పల్లిలో కాంగ్రెస్ మద్దతుతో బీజేపీకి అధికారం దక్కిందని, అమన్‌గల్‌లో కూడా ఇదే తరహా లోపాయికారి ఒప్పందం జరిగిందని పేర్కొన్నారు. క్యాతనపల్లి, తొర్రూరు, జనగామ, జహీరాబాద్ వంటి మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్‌కు మెజారిటీ సీట్లు వచ్చినప్పటికీ, ప్రజా తీర్పును గౌరవించకుండా అధికార యంత్రాంగాన్ని ఉపయోగించి చైర్మన్ పీఠాలను హైజాక్ చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సిద్ధాంతాలకు విరుద్ధంగా కాంగ్రెస్, బీజేపీలు పనిచేస్తున్నాయని, ఈ అపవిత్ర కలయికను తెలంగాణ సమాజం అసహ్యించుకుంటోందని హరీష్ రావు అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు.

పట్టణాల్లో బీజేపీ బలం పెరిగింది

- గతం కంటే భారీగా పెరిగిన ఓట్ల శాతం
- 15 మున్సిపాలిటీల్లో గట్టి పోటీ ఇచ్చాం
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 16: తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజల నుండి మంచి ఆదరణ లభించిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు తెలిపారు. ఈ ఎన్నికల్లో పార్టీ ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు. గతంతో పోలిస్తే ఎక్కువ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం పార్టీ బలోపేతానికి సంకేతమని పేర్కొన్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకు ఇతర పార్టీలు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని రామచందర్ రావు అన్నారు. భైంసాలో బీజేపీ విజయం సాధించకుండా చేయాలని చాలా ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 15 మున్సిపాలిటీల్లో బీజేపీ గట్టిపోటీ ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఇది రాష్ట్రంలో బీజేపీ ప్రభావం పెరుగుతున్నదానికి నిదర్శనమని రామచందర్ రావు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణ బీజేపీకి ఉత్సాహాన్ని నింపాయని రామచందర్ రావు పేర్కొన్నారు.





హుస్నాబాద్ చైర్‌పర్సన్‌గా దండి లక్ష్మి


- వైస్ చైర్‌పర్సన్‌గా చిత్తారి పద్మ ఏకగ్రీవ ఎన్నిక

ప్రతిపక్షం,హుస్నాబాద్, ఫిబ్రవరి 16: హుస్నాబాద్ మున్సిపాలిటీ నూతన పాలకవర్గ ఎన్నిక ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో చైర్‌పర్సన్‌గా దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్‌గా చిత్తారి పద్మ రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున వీరిద్దరి పేర్లను కౌన్సిల్ సభ్యులు ప్రతిపాదించగా, సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. దీంతో ఎన్నికల ప్రత్యేక అధికారి, ఆర్డీవో రామ్మూర్తి వీరిద్దరి ఎన్నికను అధికారికంగా ప్రకటించి, వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్‌పర్సన్ పదవికి 14వ వార్డు సభ్యురాలు దండి లక్ష్మి పేరును చెన్నమేని అనూష ప్రతిపాదించగా, ఆకుల రజిత, కేశవేని రమేష్, శోభన్ బాబు బలపరిచారు. అదేవిధంగా వైస్ చైర్‌పర్సన్ పదవికి 7వ వార్డు సభ్యురాలు చిత్తారి పద్మ రవీందర్ పేరును పిల్లి తిరుపతి ప్రతిపాదించగా, వరప్రసాద్, బొలిశెట్టి రాజు, వైద్యం కిరణ్ ప్రసాద్ సమర్థించారు. ఇతర పోటీదారులు ఎవరూ లేకపోవడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ సమావేశానికి 20 మంది సభ్యులతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యులు హాజరయ్యారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ.. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ హుస్నాబాద్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలో తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్ వంటి మౌలిక వసతుల మెరుగుదలతో పాటు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. మహిళలు, యువత, పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, అందరి సమన్వయంతో పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ మాట్లాడుతూ చైర్‌పర్సన్‌తో కలిసి సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు.

హంగ్ మున్సిపాలిటీలపై బీఆర్ఎస్ నజర్

- ఎనిమిది పట్టణాలకు ఇన్ఛార్జిల నియామకం
- కాంగ్రెస్ అరాచకాలను అడ్డుకోవడమే లక్ష్యం
- స్థానిక నేతలతో మాట్లాడిన కేటీఆర్
- పార్టీ మొత్తం అండగా ఉందని భరోసా

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 16: మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ అప్రమత్తమైంది. రేపు ఎన్నికలు జరగనున్న కీలకమైన హంగ్ మున్సిపాలిటీల కోసం వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేకంగా ఎన్నికల ఇన్‌ఛార్జిలను నియమించారు. ఈ మేరకు ఆయన ఆయా మున్సిపాలిటీల స్థానిక నాయకత్వం, నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలతో స్వయంగా మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించారు. స్థానికంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అక్రమ కిడ్నాప్‌లు, బెదిరింపులు, పోలీసుల దుర్వినియోగం వంటి అంశాలను అడిగి తెలుసుకున్న కేటీఆర్, పార్టీ పార్టీ స్థానిక నాయకత్వానికి అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ అరాచకాల నేపథ్యంలో స్థానిక నాయకత్వానికి అన్ని విధాలా అండగా నిలబడేందుకు, ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు పార్టీ తరఫున సీనియర్ నాయకులను ప్రత్యేక ఇన్‌ఛార్జిలుగా పంపుతున్నట్లు ప్రకటించారు. ఆయన ఆదేశాల మేరకు పార్టీ సీనియర్ నేతలు వెంటనే తమకు కేటాయించిన మున్సిపాలిటీలకు బయలుదేరి వెళ్లారు. నేడు ఎన్నికలు జరగనున్న 8 మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ స్పష్టంగా చైర్మన్ పీఠాలను గెలుచుకునే అవకాశం ఉన్నందున, ఈ ఎన్నికలను పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. తొర్రూర్ కు ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీమంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిలను ఇంచార్జులుగా నియమించింది. అలాగే జనగామకు శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, క్యాతనపల్లికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఖానాపూర్ కు ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఇంద్రేశం ఇంచార్జులుగా ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి లను నియమించారు. కాగజ్ నగర్ కు మాజీమంత్రి జోగు రామన్న, జహీరాబాద్కు ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునితా లక్ష్మారెడ్డి, ఇబ్రహీంపట్నం కు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు లను నియమించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే ఈ ఎనిమిది మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని, కాంగ్రెస్ ఎన్ని కుతంత్రాలు చేసినా తమ అభ్యర్థుల విజయాన్ని అడ్డుకోలేరని పార్టీ ధీమా వ్యక్తం చేసింది.



రాష్ట్రంలోని ప్రజల జీవితాలను రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్ మారుస్తోంది. టెక్నాలజీ మానవాళికి ఉపయోగపడాలి. 1990లలో బిల్‌గేట్స్‌తో మీటింగ్ తర్వాత సాంకేతికత ద్వారా పౌర సేవకు ప్రేరణ కలిగింది. విద్య, ఆరోగ్యం, వ్యవసాయంతో సహా అనేక కార్యక్రమాలతోపాటు యంగ్ మైండ్స్‌తో నిండిఉన్న ఆర్టీజీఎస్ కేంద్రాన్ని బిల్ గేట్స్ సందర్శించడం సంతోషంగా ఉంది.

- ఏపీ సీఎం చంద్రబాబు

ఓపెన్ వాయిస్


స్వశక్తితో శత్రుదేశాలకు చెక్

ఆపరేషన్ సిందూర్ తర్వాత స్వశక్తి పెంచుకోవడంపై భారత్ దృష్టి పెట్టింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా సైన్యానికి అవసరమైన అత్యాధునిక ఆయుధాలను తయారు చేస్తోంది. ఇటీవల కేంద్రం బడ్జెట్‌ను కూడా లక్ష కోట్లు అదనంగా కేటాయించింది. మరోవైపు అత్యవసర పరిస్థితిలో విమానాలు ఎక్కడైనా దిగేందుకు వీలుగా జాతీయ రహదారులను నిర్మిస్తోంది. నరేంద్రమోదీ స్టైలే వేరు.. ఎవడికి ఎక్కడ చెక్ పెట్టాలో.. ఎవరిని ఎలా అణచివేయాలో ఆయనకు తెలిసినంత ఎవరికీ తెలియదు. దేశం కోసం ఆయన ఏమైనా చేస్తారు. దేశం ఫస్ట్ నినాదాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తారు. తనను ద్వేషించినా, ధూషించినా పట్టించుకోరు. సంపాదించాలనే యావ లేని వ్యక్తి. గతంలో చైనాకు లొంగిపోయాడని కాంగ్రెస్ మోదీపై ఆరోపణలు చేసింది. ఇక అంబానీ అదానీకి దోచి పెడుతున్నాడని ఆరోపిస్తోంది. గతంలో రఫేల్ కొనుగోలుపైనా రాద్ధాంతం చేసింది కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అంటే 2014కు ముందు ఈశాన్యరాష్ట్రం ఉగ్రవాదం, వేర్పాటువాదం, సదుపాయాల లేమి. అభివృద్ధి రాహిత్యం వంటి సమస్యలు ఉండేవి. ఇక వేర్పాటు వాదం బలంగా ఉండేది. బోడోలాండ్, మణిపూర్‌లో ఉగ్రవాద సంస్థలు పనిచేయడం జరిగేది. మోదీ వచ్చాక ఆయన దేశ సరిహద్దును ఒక వంతెనగా మార్చారు. ఆగ్నేయాసియా దేశాలకు రాకపోకలు సాగించడానికి, సంబంధాలు మెరుగుపరచడం, ఇచ్చిపుచ్చుకోవడానికి ఈశాన్య భారత్‌ను బ్రిడ్జిగా చూశారు. ఇదే సమయంలో ఈశాన్య రాష్ట్రాల్ల అభివృద్ధి పనులు చేపట్టారు. రోడ్లు, రైలు మార్గాలు నిర్మించారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న వేర్పాటు వాదం తొలిపోయేలా చేశారు. ఇక మన దేశంలో మనపైనే బాంబులు కురిపించిన ప్రాంతం..సియాచెన్... కశ్మీర్‌కు 2 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న ద్వీపం. గతంలో దీనిపై చైనా ఆధిపత్యం చెలాయించింది. బెదిరిస్తూ.. వాడుకుంది. మోజాంబిక్ ఛానల్‌కు కీలకమైన సియాచెల్స్‌లో ఇప్పుడు మోదీ చక్రం తిప్పబోతున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సియాచెన్‌కు 175 మిలియన్ డాలర్ల ఆర్థికసాయం ప్రకటించారు. అక్కడ నావీ బేస్ ఏర్పాటు చేయబోతున్నారు.భారత్ ఆర్థికసాయంతో గృహ నిర్మాణం, ఉపాధి శిక్షణ కార్యక్రమాలు ఉన్నాయి. మోజాంబిక్ ఛానెల్ వైపు చైనా షిప్పింగ్ రాకపోకలను గమనించేలా భారత నేవీ బేస్ ఏర్పాటు అవుతుంది. మోదీ దీర్ఘకాలిక దృష్టితో ఆర్థిక సహాయం ద్వారా మిత్రత్వాలు పెంచుకుంటూ, రక్షణ ప్రాంగణాన్ని బలోపేతం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత ఆధిపత్యం పెరుగుతుందిమూడేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించిన రహదారులపై విమానాల ల్యాండింగ్ విజయవంతంగా నిర్వహించింది. తాజాగా భారత వైమానిక దళం (ఐఏఎఫ్) అస్సాం మోరాన్‌లో ఎన్‌హెచ్ -127పై యుద్ధ విమానాల ల్యాండింగ్ ట్రయల్స్ విజయవంతం చేసింది. ఈశాన్య భారతదేశంలో మొదటి ఈఎల్ఎఫ్‌గా, సుఖోయ్, రాఫెల్ వంటి యుద్ధ విమానాలు ఇక్కడ నిలిచే సామర్థ్యం ప్రదర్శించాయి. ఇది దేశ రక్షణ వ్యవస్థకు కీలకం.యుద్ధ సమయంలో ఎయిర్‌స్ట్రిప్‌లు దెబ్బతిన్నప్పుడు హైవేలను రన్‌వేలుగా దిగడానికి వీలుగా నిర్మించారు. అస్సాం 4.2 కి.మీ. భాగం 4-లేన్ రూపంలో నిర్మించారు. ప్రభుత్వ భవనాలు, సైనిక కార్యకలాపాలకు ఉపయోగపడుతుంది. ప్రధాని మోదీ నేరుగా హైవేపై ల్యాండ్ చేసి ప్రారంభించనున్నారు.ఈశాన్య రాజకీయ, వ్యూహాత్మక కేంద్రం. చైనా, మయన్మార్ సరిహద్దుల సమీపంలో ఈ ఈఎల్ఎఫ్ యుద్ధ సామర్థ్యాన్ని పెంచుతుంది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆధునికీకరణలో ఇదో మైలురాయి.భారతదేశంలో 10కిపైగా ఈఎల్ఎఫ్‌లు రానున్నాయి. ఈశాన్యలో మొదటిది మోరాన్. స్వదేశీ టెక్నాలజీతో అభివృద్ధి చేసి ఆత్మనిర్భర్ భారత్‌కు దోహదపడుతుంది. చైనా ప్రపంచ బౌద్ధులను తన వలయంలోకి తీసుకునే ప్రయత్నం చేస్తోంది. మోదీ దీనికి సమర్థవంతమైన సమాధానం ఇచ్చారు. ఈశాన్యాన్ని గ్లోబల్ బౌద్ధ టూరిజం కేంద్రంగా మార్చి, థాయ్‌లాండ్, వియత్నాం వంటి దేశాలతో భాగస్వామ్యం పెంచారు. ఇది కేవలం ప్రాంతీయ మార్పు కాదు గ్లోబల్ డిప్లొమసీలో భారత్ ఆధిక్యానికి ముఖ్య రక్షణ.రఫేల్, సుఖోయ్ వంటి భారీ విమానాలకు సరిపోతుంది. ఈ నిర్మిణంతో పొరుగున ఉన్న చైనా, బంగ్లాదేశ్‌తో యుద్ధం వస్తే ఇక్కడి నుంచే యుద్ధ విమానాలను పంపే అవకాశం కూడా ఉంటుంది. దీంతో శత్రుదేశాల్లో వణుకు మొదలైంది.

ప్రతిపక్షం
హైదరాబాద్
మంగళవారం
17.02.2026

బాల్యాన్ని మింగేస్తున్న కేన్సర్

కేన్సర్ అనగానే ముందుగా పెద్దవాళ్లే గుర్తుకొస్తారు. కానీ, కేన్సర్ బాధితుల్లో ఐదు శాతం పిల్లలే ఉంటున్నారు. చెడు అలవాట్ల వంటి ముప్పు కారకాలేవీ లేకపోయినా పిల్లలు కేన్సర్ బారిన పడటం దురదృష్టంగానే భావించాలి. పుట్టుకతోనే జన్యువుల పనితీరు అస్తవ్యస్తం కావటం దీనికి మూలం. అయితే సరైన సమయంలో గుర్తించగలిగితే పిల్లల్లో తలెత్తే కేన్సర్లని దాదాపుగా నయం చేయవచ్చు.



కోడం పవన్ కుమార్
9848992825

ఒకప్పుడు గొప్పింట్లో కనిపించే కేన్సర్ భూతం, ఇప్పుడు పేద ధనిక తేడా లేకుండా బాల్యాన్ని కూడా మింగేస్తోంది. లుకేమియా, మెదడు కేన్సర్, లింఫోమా, న్యూరోబ్లాస్టోమా, విల్మ్స్ ట్యూమర్ వంటి కేన్సర్లు చిన్నారులను నులిపెడుతున్నాయి. బలహీన ఆరోగ్య వ్యవస్థ కలిగిన తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లోనే బాల్య కేన్సర్ల భారం అధికంగా ఉంటోంది. మన దేశంలో ఏటా లక్ష మంది పిల్లల్లో సుమారు 1215 మంది కేన్సర్ బారిన పడుతున్నారు. 2 నుంచి 14 ఏళ్ల వయస్సులోపు పిల్లల్లో కేన్సర్‌ను గుర్తిస్తున్నారు. సరైన అవగాహన, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ ద్వారా కేన్సర్ సమస్యని అధిగమించవచ్చని ఆరోగ్య నిపుణులు తెలియజేస్తున్నారు. కేన్సర్ అనగానే ముందుగా పెద్దవాళ్లే గుర్తుకొస్తారు. కానీ, కేన్సర్ బాధితుల్లో ఐదు శాతం పిల్లలే ఉంటున్నారు. చెడు అలవాట్ల వంటి ముప్పు కారకాలేవీ లేకపోయినా పిల్లలు కేన్సర్ బారిన పడటం దురదృష్టంగానే భావించాలి. పుట్టుకతోనే జన్యువుల పనితీరు అస్తవ్యస్తం కావటం దీనికి మూలం. అయితే సరైన సమయంలో గుర్తించగలిగితే పిల్లల్లో తలెత్తే కేన్సర్లని దాదాపుగా నయం చేయవచ్చు. పెద్దవారిలో 60 65 శాతం మందిలో కేన్సర్ తగ్గితే, పిల్లల్లో 8590 శాతం మందిలో పూర్తిగా నయం చేయవచ్చు. ప్రాథమిక దశలో గుర్తించి సరైన చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు. వ్యాధి ముదిరాక గుర్తించినా ఫలితం అంతగా ఉండదు. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కేన్సర్ బారిన పడిన చిన్నారుల్లో సగం మంది వ్యాధిని గుర్తించక, వైద్యం అందక మరణిస్తున్నారని ఓ అధ్యయనంలో వెల్లడయింది. ప్రతి ఏటా కొత్తగా రెండు లక్షల చిన్నారులకు కేన్సర్ వ్యాధి సోకుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. కేన్సర్ కేసులు ఎక్కువగా ఆఫ్రికా, దక్షిణ మధ్య ఆసియా, పసిఫిక్ ఐలాండ్‌లలో నమోదవుతున్నాయి. 2015 నుంచి ప్రపంచంలోని చాలా దేశాల్లో లింఫోబ్లాస్టిక్ లుకేమియా వ్యాపిస్తోంది. అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో కేన్సర్ సోకిన అత్యధిక మంది పిల్లలు ఐదేళ్లకు మించి బతక్కపోవడానికి, కేన్సర్‌ను సకాలంలో గుర్తించకపోవడం, వైద్యం ఖర్చు భరించలేనంతగా ఉండడం, మధ్యలోనే చికిత్స ఆగిపోవడం వంటి కారణాలు చిన్నారుల పాలిట శాపంగా మారాయి. రక్త (లుకేమియా), లింఫ్ వ్యవస్థ (లింఫోమా), మెదడు, ఎముక (బోన్ ట్యూమర్), కంటి (రెటీనోబ్లాస్టోమా), నాడీ కణాలు (న్యూరోబ్లాస్టోమా), కిడ్నీ (విల్మ్స ట్యూమర్), కండరాలు (రాబ్డోమయోస్కారోమా) వంటి కేన్సర్లు 19 ఏళ్లలోపు పిల్లల్లో తలెత్తుతున్నాయి. అమ్మాయిల కన్నా ఎక్కువగా అబ్బాయిల్లోనే ఈ కేన్సర్ లక్షణాలు ఉంటున్నట్లు ఓ అధ్యయనంలో తేలింది. ఢిల్లీలోని ఎయిమ్స్, చెన్నైలోని అడయార్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ లలో సేకరించిన డేటా ప్రకారం అబ్బాయిల్లోనే కేన్సర్ లక్షణాలు అధికంగా ఉంటున్నట్లు ఢిల్లీలోని 'పాపులేషన్ బేస్డ్ కేన్సర్ రిజిస్ట్రీ ఆఫ్ ఇండియా' తెలిపింది. అయితే అమ్మాయిల్లో కేన్సర్ బారిన పడినా బయటకు పొక్కనివ్వకుండా ఉంచడం వల్ల అమ్మాయిల సంఖ్య తక్కువ ఉంటున్నట్లు ఆ సంస్థ భావించింది. కేన్సర్ సోకినప్పటికీ లింగ వివక్ష కారణంగా వారిని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యులకు చూపించకపోవడమే ఇందుకు కారణమని వైద్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఒకవేళ పరీక్షల్లో వారికి కేన్సర్‌గా తేలినా, చికిత్స చేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. చికిత్స పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినప్పటికీ, ప్రజల్లో చైతన్యం పెరిగినప్పటికీ చాలా మంది స్క్రీనింగ్‌కు రాకపోతుండడంతో రోగ నిర్ధారణ కష్టసాధ్యంగా మారింది. యుక్త వయస్సులో వచ్చే కేన్సర్, 50 శాతం జన్యుపరంగా వస్తే, మరో 20 శాతం అలవాట్ల కారణంగా సంభవిస్తున్నాయి. నాలుగు తరాల కిందటివారిలో ఈ వ్యాధి లక్షణాలు ఉన్నా, ఆ తర్వాత పిల్లలకు సోకే ప్రమాదముంది. వీటిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. అప్పుడే త్వరగా చికిత్స అందివ్వడానికి సాధ్యమవుతుంది. కేన్సర్ బారిన పడిన చిన్నారుల్లో 3వ వంతు అసంపూర్ణ చికిత్స కారణంగా బతికే అవకాశాన్ని కోల్పోతున్నారు. దిగువ, మధ్యతరగతి ఆదాయం కలిగిన దేశాల్లో 30 శాతం మంది చికిత్సను మధ్యలోనే వదిలేస్తున్నారు. మరింత పేదరికంలో ఉన్న దేశాల్లో 99 శాతం మంది చికిత్స చేయించకపోవడం, లేదంటే చికిత్సను మధ్యలోనే నిలిపి



వేయడం జరుగుతోంది. ఇక ప్రత్యామ్నాయ, సాంప్రదాయ చికిత్స విధానాన్ని అనుసరిస్తున్నారు 31 శాతం ఉండగా, ఆర్థిక పరిస్థితులు అనుకూలించక చికిత్సను మానుకుంటున్నవారు 28 శాతం ఉన్నారు. కేన్సర్‌కు చికిత్స లేదనీ, నయం కాని వ్యాధని భావిస్తున్నవారు 26 శాతం ఉన్నారు. ఏదేమైనా అందివచ్చిన ఆధునిక వైద్య చికిత్స ద్వారా కేన్సర్‌ను నయం చేయడానికి వైద్యులు కృషి చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక వైద్యశాలలను ఏర్పాటు చేసి ఉచితంగా చికిత్సను అందిస్తోంది. చికిత్సలో భాగంగా కీమోథెరపీ ప్రధానమైనది. ఒక్కోసారి సర్జరీ చేయవలసి రావొచ్చు. రేడియేషన్ వల్ల దుష్ప్రభావాలు ఉండటానికి ఆస్కారముంది. పది, పదిహేను సంవత్సరాల తర్వాత ఈ దుష్ప్రభావాలు బయటపడే అవకాశముంటుంది. అందుకే వీలైనంత మేరకు రేడియోషన్ లేకుండానే చికిత్స చేయడానికి వైద్యులు ప్రయత్నిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే రేడియేషన్‌ను ఉపయోగిస్తున్నారు. కాబట్టి కేన్సర్ లక్షణాలు గుర్తించిన వెంటనే తల్లిదండ్రులు అప్రమత్తమై పిల్లలకు చికిత్స చేయించాలి.

ఖర్చు పెరిగేకొద్దీ అమ్మాయిల విషయంలో వివక్ష చూపిస్తున్నారు. దక్షిణ భారతంతో పోలిస్తే ఉత్తరాదిన; మెట్రోపాలిటన్ నగరాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో కేన్సర్ బాధితులకు చికిత్స విషయంలో లింగ వివక్ష ఎక్కువగా ఉంటున్నట్లు కనిపిస్తోంది. కేన్సర్ పరీక్షల విషయంలోనే కాదు, ఎంతోమంది కేన్సర్ బాధితులు అత్యంత ఖరీదైన మూలకణ మార్పిడి చికిత్స చేయించుకుంటున్నారనే అనే అంశాన్ని కూడా వైద్యులు పరిశీలించారు. ఈ విషయంలో కూడా లింగవివక్ష ఉంటున్నట్లు స్పష్టమైంది. అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిలకే ఎక్కువగా చికిత్స చేయిస్తున్నట్లు అధ్యయనంలో వెల్లడయింది. ప్రజల్లో ఉన్న ఈ తరహా ఆలోచనాధోరణని మార్చాలని వైద్యులు తెలియజేస్తున్నారు.

మన రాష్ట్రం విషయానికొస్తే, సుమారు 5 వేల మంది చిన్నారులు ప్రతి ఏటా కేన్సర్‌కు గురవుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జన్యుపరంగానే ఎక్కువ మంది వీటి బారిన పడుతున్నట్లు తేలింది. పదేళ్ల వయస్సులోపు పిల్లల సంఖ్య అధికంగా ఉంటోంది. జన్యుపరంగా తల్లిదండ్రుల్లోని క్రొమోజోముల స్థాయిని బట్టి 10 లేదా 11 ఏళ్లకు కేన్సర్‌కు గురవుతున్నారు. ఆధునిక సాంకేతిక

(వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్టు)

శివుని సమానత్వమే 'జై బీసీ, ఎస్సీ, ఎస్టీ తెలంగాణ'




సంపతి రమేష్
7989579428

భారతదేశ సామాజిక వ్యవస్థలో శతాబ్దాలుగా కుట్రపూరితంగా అణిచివేయబడ్డ బీసీ, ఎస్సీ, ఎస్టీల బాధ ఒక మౌనచరిత్రగా మిగిలిపోయింది. అది పూలే, సాహు మహారాజ్, అంబేద్కర్, కాన్సిరాం వంటి మహనీయుల చైతన్యంతో అణగారిన వర్గాల అస్తిత్వ ఉద్యమాలు జరిగాయి. ఇదంతా సమానత్వం కోసం సాగిన సమరమే. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చాక అందరికీ విముక్తి లభించింది. అయినా జనాభా ప్రకారం సమప్రాతినిత్యం లేదు. ఇదంతా కుట్రపూరితంగా జరుగుతున్న ఆధునిక అణచివేతకు నిదర్శనమే. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో మహనీయుల వారసత్వ జ్ఞానంతో సబ్బండ కులాల గర్జనకు ఆజ్యం పోస్తున్న మహానాయకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్. ఆయనే బీసీ, ఎస్సీ, ఎస్టీల విముక్తి ఉద్యమ సారథిగా తమ వాటాను అడుగుతూ శివుని ఆధ్యాత్మిక సమానత్వాన్ని తెరపై తీసుకొచ్చిన నాయకుడు. ఇదీ శివుడి శూద్రుల రాజ్యానికి పునాది కాబోతుంది. ఆధ్యాత్మిక ప్రపంచంలో అణగారిన వర్గాలకు సమ భాగస్వామ్యం, సమ ప్రాతినిత్యాన్ని సృష్టిస్తే అది సామాజిక, రాజకీయ యుద్ధంగా పరివర్తన చెంది రాజ్యంలో అట్టడుగు వర్గాలకు వాటా లభిస్తుంది. అదే సమానత్వ భావనను ఆధ్యాత్మిక స్థాయిలో బసవేశ్వరుని శివతత్వం శతాబ్దాల కిందటే బోధించింది.

శివతత్వమే సమానత్వం

భారతదేశ చరిత్రను పరిశీలిస్తే, అణచివేత, అసమానత్వం, వర్ణవ్యవస్థల బంధనాలలో ఇరుక్కున్న బహుజనుల సమరమే. ఈ ఆధిపత్యంపై సమానత్వం, మానవ గౌరవం, స్వేచ్ఛ కోసం విప్లవాత్మక స్వరాలు మిన్నంటాయి. ఈ స్వరాల్లో ఒక గొప్ప ప్రతిధ్వని బసవేశ్వరుడి శివతత్వం. ఇది కేవలం ఆధ్యాత్మిక భావన కాదు, సామాజిక న్యాయం కోసం చేసిన మహోన్నత పోరాటం. చరిత్రకారుల పరిశోధనల ప్రకారం, సింధు నాగరికత కాలంలో "పశుపతి ముద్ర"గా పిలవబడే శివుడు ప్రాచీన స్వరూపంగా భావించబడతాడు. ప్రకృతిని ఆరాధించే ఆ సంస్కృతిలో శివుడు సృష్టి, సంరక్షణ, సమానత్వానికి ప్రతీక. అంటే ఈ దేశ మూలవాసుల ఆధ్యాత్మిక చైతన్యంలో శివతత్వం ఇమిడి ఉన్నది. ఇది స్వేచ్ఛ, సమానత్వం, సోదరాభావానికి ప్రతిబింబం. శివుని సమానత్వంతో బసవేశ్వరుడు 12వ శతాబ్దంలోనే వర్ణవ్యవస్థను సవాలు చేశారు. ఆయన శివతత్వం "ప్రతి మనిషి శివస్వరూపుడే" అనే సూత్రాన్ని ప్రతిపాదించింది. కులం, జాతి, లింగం అనే భేదాలను తిరస్కరించి, శ్రమకు గౌరవం ఇచ్చి, ప్రతి వ్యక్తికీ ఆధ్యాత్మిక హక్కు ఉందని ప్రకటించారు. ఆయన స్థాపించిన "అనుభవ మంటప" ప్రపంచం



లో తొలి ప్రజాస్వామ్య వేదికగా చెప్పబడుతుంది. అక్కడ అట్టడుగు కులాల ప్రజలు, మహిళలు, శ్రమజీవులు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తపరిచారు. ఇది కేవలం ధార్మిక సంస్కరణ కాదు, ఒక సామాజిక విప్లవం. భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ పీఠికలో "సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం" అనే లక్ష్యాలు బసవేశ్వరుని శివతత్వంలో ఉన్న సమానత్వ బీజాలకు ఆధునిక చట్టబద్ధ రూపం.

జై బీసీ ఎస్సీ ఎస్టీ తెలంగాణ వాదం

భారతదేశ చరిత్రలో అణచివేతకు గురైన బీసీ, ఎస్సీ, ఎస్టీ సమాజాలు శతాబ్దాలుగా శంకరుడిని తమ ఆరాధ్యదైవంగా కొలుస్తారు. ఎందుకంటే ఆయన ఆధ్యాత్మిక ఆరాధన బహుజన వర్గాలకు దగ్గర ఉంటుంది. సమానత్వాన్ని కోరుకునే పైకులాలు సైతం శివుని ఆరాధిస్తారు. శంకరుడు రాజసభల దేవుడు కాదు, ఆయన శ్మశానవాసి. శివుడు బంగారు సింహాసనాలపై కూర్చొని ఆజ్ఞలు జారీ చేసే దేవుడు కాదు, బూడిద రాసుకుని సమానత్వాన్ని ప్రకటించే విప్లవ స్వరూపం. ప్రతి జీవి సమానుడనీ బోధిస్తూ కులం, వర్ణం, జాతి, లింగం బేధాలను బద్దలుగొట్టిన మూలవాసుల దారిదీపం (దేవుడు). ఆయన గళంలో నాగు, చేతిలో దమరుకం, శరీరంపై బూడిద—ఇవి సామాజిక అహంకారాన్నీ తిరస్కరించే సంకేతాలు. ఆయన నృత్యం సమస్త జీవుల సమాన హక్కుల నృత్యం. శివుడు ప్రకృతికి ప్రతీక, శ్రమకు ప్రతీక, అట్టడుగు వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక. ఇప్పటికి భారతదేశంలో దళితుల ఇళ్లు ఊరికి దూరంగానే ఉంటాయి. వారే కాటి కాపరులుగా, శవాలకు డప్పులు కొట్టే వాయిద్య కారులుగా, కుళ్లిన చెత్తను, చనిపోయిన జంతువులను ఊరిబయట పారేసే సపాయిలుగా దళితులే ఉంటారు, వెనకబడిన కులాలు సైతం తమ కుల వృత్తుల ద్వారా గ్రామానికి సేవ చేశారు. ఈ విధంగా గ్రామాన్నీ కట్టి, గ్రామానికి సేవ చేసే సమస్త సబ్బండ కులాలు శివునికి ప్రతిరూపాలే. కానీ ఆ కులాలు సమాన హక్కులు, అవకాశాలు పొందడంలో ఇప్పటికీ ఓడిపోతున్నారు. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ల ఉద్యమం దళిత బహుజన సమానత్వం, సామాజిక న్యాయం కోసం సాగుతుంది. ఇదీ శివుని తాత్విక ఆలోచనకు ప్రతిరూపంగా సాగుతుంది. కావున శివతత్వం చెప్పే సూత్రం స్పష్టం—— "మానవత్వమే మతం, సమానత్వమే పరమధర్మం."నాటి సింధు నాగరికతలో పశుపతిగా పిలవబడిన శివుడి గురువు పూర్వ జంబుద్వీప రాజ్యాన్ని పాలించిన ఆది జాంబవుడు. శివుడే బుద్ధుడుగా, అశోకుడుగా, సంత్ రవిదాస్ గా, బసవేశ్వరుడుగా, పూలేగా, శివాజీగా, అంబేద్కర్ గా సమానత్వ వారసత్వ యుద్ధం సాగింది. ఇదీ ఈ శివరాత్రి నుంచి "జై బీసీ ఎస్సీ ఎస్టీ తెలంగాణ" నినాదంగా డాక్టర్ విశారదనిజం మారుమోగుతుంది. ఈ నినాదం 90 శాతం అట్టడుగు వర్గాలకు 90 శాతం రిజర్వేషన్ల ఉద్యమంగా ముందుకు నడవబోతుంది.

(వ్యాస చరయిత సామాజిక విశ్లేషకులు)



రేషన్ కోసం కిలో మీటర్ల నడక.. బాధ్యత ఎవరిది?



జనగాం ప్రసాద్ రావు
76720 82695

ములుగు జిల్లా వాజేడు మండలం పూసూరు గ్రామ పంచాయితిలో ఒక ప్రాథమిక హక్కు కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వము అందించే పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (రేషన్) బియ్యం తీసుకోవాలంటే గ్రామస్తులు మూడు నుండి నాలుగు కిలోమీటర్లు నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది కేవలం అసౌకర్యం మాత్రమే కాదు వృద్ధులు, మహిళలు, వికలాంగులు, చిన్న పిల్లలున్న కుటుంబాలకు ఇది పెద్ద భారంగా మారింది.రేషన్ వ్యవస్థ లక్ష్యం ఏమిటి? పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఆహార భద్రత కల్పించడం. కానీ పూసూరు గ్రామంలో పరిస్థితి చూస్తే, ఆ భద్రత పొందేందుకు ముందుగా శారీరక శ్రమతో పోరాడాల్సిన పరిస్థితి ఉంది. రోజువారీ కూలి చేసే వారు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు అందరికీ ఈ నడక ఒక శిక్షలా మారుతోంది. గ్రామ పంచాయితి స్థాయిలో రేషన్ షాప్ ఏర్పాటు చేయడం సాధ్యమే. అయితే ప్రశ్న ఏమిటంటే గ్రామంలో ఈ అవసరం అధికారులకు తెలియదా? మండల స్థాయి అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టలేదా? అధికార పార్టీ నాయకులు, ప్రతిపక్ష పార్టీ నాయకులు ప్రజా సమస్యలపై స్పందించాల్సిన బాధ్యత ఎక్కడికి పోయింది? గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ ఈ సమస్యను అధికారికంగా పైస్థాయికి తీసుకెళ్లారా? సాధారణంగా ఒక గ్రామంలో రేషన్ షాప్ లేకపోతే, పంచాయితి తీర్మానం చేసి మండల అధికారులకు పంపవచ్చు. జనాభా, కార్డు హోల్డర్ల సంఖ్య, దూరం వంటి వివరాలతో ప్రతిపాదన పంపితే కొత్త రేషన్ డీలర్ పాయింట్ మంజూరు చేసే అవకాశం ఉంటుంది. అంటే ఇది అసాధ్యమైన పని కాదు. కానీ ప్రయత్నం, పట్టుదల, ఫాలోఅప్ అవసరం.ఇక్కడ ప్రజల పాత్ర కూడా ముఖ్యమే. గ్రామస్తులు కలిసి రాతపూర్వక వినతి పత్రం తయారు చేసి మండల తహసీల్దార్, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అందించాలి. గ్రామ సభలో ఈ అంశాన్ని అధికారిక అజెండాగా పెట్టాలి. సమస్య రికార్డులోకి వస్తేనే పరిష్కారానికి దారి ఉంటుంది. ప్రజాస్వామ్యంలో హక్కులు అడిగితే ఇవ్వబడవు డిమాండ్ చేస్తే వస్తాయి. పూసూరు గ్రామ ప్రజల రేషన్ సమస్య కూడా అలాంటిదే. ఇది రాజకీయ విమర్శల విషయం మాత్రమే కాదు ఇది ప్రాథమిక జీవన అవసరానికి సంబంధించిన విషయం.

ప్రశ్న ఇంకా అలాగే ఉంది: రేషన్ కోసం నడుస్తున్న ప్రజల అడుగుల శబ్దం అధికారులకు ఎప్పుడు వినిపిస్తుంది? ఆ నడకను దగ్గరలోని రేషన్ షాప్ వరకు తగ్గించే రోజు ఎప్పుడు వస్తుంది?

(రచయిత సమాచార హక్కు వికాస సమితి మండల సెక్రటరీ, పూసూరు,వాజేడు మండలం)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం




వనదుర్గ సన్నిధిలో

కనుల విందుగా ఎడ్లబండ్ల ఊరేగింపు

- **జనారణ్యంగా మారిన అభయారణ్యం.**
- **బోనాలు సమర్పించి మొక్కు తీర్చుకున్న భక్తుజనం.**
- **నేడు రథోత్సవం**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి16 : తెలంగాణ రెండో అతి పెద్ద జాతరైన ఏడుపాయల వనసుర్గ మాత జాతర సందర్భంగా రెండోరోజు సోమవారం ఏడుపాయల వన దుర్గమ్మ క్షేత్రం భక్తజన సంద్రమైంది. జాతరలో కీలక ఘట్ట మైన బండ్ల ఊరేగింపు సాయంత్రం కనుల పండువగా జరిగింది. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు భక్తులను ఎంతగానో అలరించాయి. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహాశివరాత్రిని పురస్కరిం చుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు, సోమవారం ఉదయం పుణ్యస్నానాలు ఆచరించి జగన్మాతను దర్శిం చుకుని విరమించారు. అమ్మవారి ఆలయం విద్యుత్ దీప కాంతులతో ధగధగలాడింది. జాతర చివరి రోజైన మంగళ వారం (నేడు) రథోత్సవం వైభవంగా జరుగనునట్టు ఆలయ ఆలయ ఈవో వీరేశం తెలిపారు.ఘన,ఘన గంటలు, డప్పు చప్పుళ్ల మధ్య, బండ్లు ఊరేగింపు కార్యక్రమం, శివసత్తుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు, ఎక్కడ చూసినా జన సుందరంగా మారింది, దుర్గమ్మ పరిసరాలు అమ్మ వారి నామస్మరణతో మార్మోగింది. ఉత్సవాల రెండో రోజు అంగరంగ వైభవంగా జరిగిన బండ్లు ఊరేగింపు కార్యక్ర మం జాతరకే తలమానికం అయ్యింది. వివిధ రంగులతో అత్యంత వైభవంగా అలంకరించిన ఎడ్ల బండ్లు, రంగు ,రంగుల చీరలు, కొబ్బరిమట్టలు, మామిడి కొమ్మల తోరణాలతో అలకరించి, దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించి ఊరేగించారు. అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం పా పన్నపేట సంస్థానాధీశుల బండి ముందు నడవగా, దాని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన బండ్లు అనుసరించాయి. సాయంత్రం ప్రారంభమైన ఈ బండ్లు తిరిగే అపురూప ఘట్టం నాగ్సాన్‌పల్లి వైపు నుంచి దుర్గామాత ఆలయం వరకు చేరుకుని జాతర చుట్టూ తిరిగాయి. ఏడుపాయల జాతర మూడు రోజులపాటు జరుగనుండగా,రెండో రోజు బండ్లు తిరిగే కార్యక్రమానికి భక్తులు ప్రాధాన్యమిస్తారు. మహాశివరాత్రి రోజు వచ్చిన వారికి తోడు బండ్లు తిరిగే కా ర్యక్రమాన్ని చూడడానికి వచ్చిన భక్తులతో ఏడుపాయల అటవీప్రాంతం జనారణ్యంగా మారింది. తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. పోతంశెట్టిపల్లి వైపు నుంచి భక్తులు భారీగా తరలి రావడం కనిపించింది. నేడు రథోత్సవం ఆడంబ రంగా నిర్వహించేందుకు దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు జాతరలో వనదుర్గా భవానీ మాతకు పెద్దఎత్తున బోనాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు నెత్తిన బోనం పెట్టుకొని, దారి పొడవునా నృత్యాలు చేస్తూ విన్యాసాలు ప్రదర్శిస్తూ వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పిం చారు. హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చినవారు వినూత్న వేషధారణలతో అమ్మవారికి బోనాలు సమర్పిం చడం, చూపరులను ఆకట్టుకుంది. జిల్లా వైద్యాధికారి శ్రీ రామ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం.... ఏడుపాయల భక్తుల కోసం ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురైన అత్యవసర వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేశారు .108 వాహనాలు సైతం ఏర్పాటు చేశారు.



గాయపడిన కానిస్టేబుల్ ను పరామర్శించిన పోలీస్ కమీషనర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 15 : నిజామాబాద్ నగరం లో రోడ్డు ప్రమాదం లో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ ను పోలీస్ కమీషనర్ సాయి చైతన్య పరమర్శించారు. జిల్లా పాస్ పోర్ట్ కార్యాలయం లో విధులు నిర్వహించే పోలీస్ కానిస్టేబుల్ ఎన్. గంగా ప్రసాద్ సోమవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గా యపడ్డాడు. వెంటనే అతడిని నగరంలోని మెడికవర్ హాస్పిటల్ కు తరలించారు. చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ను పోలీస్ కమీషనర్ పరామర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ ప్రసాద్ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అతనికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధితుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి , వారికి ధైర్యం చెప్పారు. చికిత్సకు సంబంధించి పోలీస్ శాఖ నుండి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని పోలీస్ కమీషనర్ భరోసా ఇచ్చారు.




కొలువుదీరిన మున్సిపల్ చైర్మన్లు

- **కామారెడ్డి లో కాంగ్రెస్-బీఆరెస్ దోస్తీ**

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, ఫిబ్రవరి 16: జిల్లా లోని నాలుగు మున్సిపాలిటీలలో చైర్మన్లు, వైస్ చైర్మన్లు కొలు వుదీరారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతి పక్షం బీఆర్ఎస్ మధ్య మాటల తూటాలు పేలుతున్న వేళ కామారెడ్డి మున్సిపాలిటీలో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అక్కడ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ పదవులను రెండు పార్టీలు పంచుకున్నట్లుగా తెలుస్తోం ది. మున్సిపల్ చైర్ పర్సన్గా 38వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన ఉమారాణి కాంగ్రెస్ కండువా కప్పు కున్నారు. దీంతో ఆమె పేరును చైర్మన్ అభ్యర్థిగా ఆ పార్టీ ఖరారు చేసింది. ఇక వైస్ చైర్ పర్సన్గా 12వ వార్డు కౌన్సి లర్ కాసార్ల గోదావరి ఎన్నికయ్యారు. కాగా, కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 49 వార్డులు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ 19 చోట్ల విజయం సాధించింది. బీజేపీ 16, బీఆర్ఎస్ 11 వార్డుల్లో, ఇండి పెండెంట్లు మూడు చోట్ల గెలుపొందారు. మున్సిపాలిటీ పీఠాన్ని కైవసం చేసుకోవాలంటే మ్యాజిక్ ఫిగర్ 25 సీట్లు కావాల్సి ఉండగా, కాంగ్రెస్, బీఆరెస్ కౌన్సిలర్ లు కలవ దంతో 33కు చేరింది.

ఎల్లారెడ్డి చైర్మన్గా పద్మశ్రీకాంత్

ఎన్నికయ్యారు. ఈ మేరకు బల్దియా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన చైర్మన్గా ప్రమాణస్వీకారం చేశారు. పట్టణంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 12 వార్డులకు గాను 10 వార్డులను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ నుంచి ఒకరు, స్వతంత్రు లు ఒకరు గెలుపొందారు. చైర్మనగిరికి మ్యాజిక్ ఫిగర్ సరిపోవడంతో కాంగ్రెస్ అభ్యర్థుల్లో పద్మశ్రీకాంత్ చైర్మన్గా ప్రమాణస్వీకారం చేశారు. వైస్చైర్మన్గా మత్తమాల భాగ్యవతి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొన్నారు. ఎన్నిక కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

బాన్సువాడ మున్సిపల్ చైర్మన్గా కాసుల విజయ

బాన్సువాడ చైర్మన్ గా కాసుల విజయ బాలరాజ్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 11న జరిగిన ఎన్నికల్లో బాన్సువాడ మున్సిపాలిటీ 19 వార్డులు ఉండగా అందులో 11 వాళ్లను కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు విజయం సాధించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుండి కాసుల విజయ మున్సిపల్ చైర్మన్ గా, వైస్ చైర్మన్ గా రేష్మ ఎజాజ్ ఎన్నిక ఎవరు అపోజిషన్ లేకపోవడం తో బాన్సువాడ ఎన్నికల అధికారి సబ్ కలెక్టర్ కిరణ్మయి వారిని అధికారికంగా ప్రకటించారు. బాన్సు వాడ మున్సిపల్ చైర్మన్ గా కాసుల విజయ బాలరాజ్, వైస్ చైర్మన్ గా రేష్మ ఎజాజ్ లను సబ్ కలెక్టర్ వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ చైర్మన్ కు ఎంఐఎం పార్టీ మద్దతు తెలిపారు. అంతకుముందు బాన్సువాడ మున్సిపాలిటీ నూతన కౌన్సిలర్లకు సబ్ కలెక్టర్ కిరణ్మయి వార్డుల వారిగా ప్రమాణస్వీకారం చేయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాన్సువాడ స్టేషన్ హౌస్ అధికారి తుల శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.మున్సిపల్ వైస్ చైర్మన్ గా రేష్మ బేగం ఎజాజ్ ఎన్నికయ్యారు.

బిచ్కుంద చైర్మన్గా సీమ షెట్కార్ ,
వైస్ చైర్మన్గా భాగ్యలక్ష్మి

బిచ్కుంద వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం లో నూతన పాలకవర్గం ఘనంగా కొలువుదీరింది. సోమవారం జరిగిన ఎన్నిక ప్రక్రియలో మున్సిపల్ చైర్మన్ గా సీమ షెట్కార్, వైస్ చైర్మన్గా భాగ్యలక్ష్మి గార్లు ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు.అనంతరం వారు పదవీ బాధ్యతలను స్వీ కరిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన పుర పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు.

మల్లన్న హుండీ లెక్కింపులో నగదు అపహరించిన ఉద్యోగి సస్పెన్షన్


ప్రతిపక్షం, కొమురవెల్లి, ఫిబ్రవరి 16: మల్లన్న ఆలయంలో ఈనెల 12న కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు నిర్వహిం చగా ఆలయ ఉద్యోగి ప్లంబర్ ఎస్.విజయ్ కుమార్ నగదు రూ.9000/అపహరించిన విషయం మనకు తెలిసిందే. మల్లన్న హుండీ లెక్కింపులో జరిగిన విషయంలో ఆలయంలో ప్లంబర్గా పనిచేస్తున్న ఎస్. విజయ్ కుమార్ ని ఆలయ క్రమశిక్షణ నియమావ ళి ప్రకారం సోమవారం ఆలయ ఈఓ టంకశాల వెంకటేష్ విజయ్ కుమార్ ను విధుల నుండి సస్పెండ్ చేశారు.




చేర్యాల మున్సిపల్ చైర్మన్‌గా ముస్త్యాల అరుణ

- **వైస్ చైర్మన్ గా ఉమ శ్రీధర్**

ప్రతిపక్షం, చేర్యాల, ఫిబ్రవరి 16: చేర్యాల మున్సిపాలిటీ లో చైర్మన్ (బిఆర్ఎస్) వైస్ చైర్మన్ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. మున్సిపల్ చైర్మన్ గా ముస్త్యాల అరుణ బాలనర్సయ్య (బి ఆర్ ఎస్ పార్టీ) - ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. మున్సిపల్ వైస్ చైర్మన్: మెడిశెట్టి ఉమ శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఏకగ్రీవ ఎన్నికలు చేర్యా లలో ఎలాంటి గందరగోళం లేకుండా పాలకవర్గం ఏర్పడ టానికి దోహదపడ్డాయి. ఎన్నికల అధికారి వీరి ఎన్నికను అధికారికంగా ప్రకటించి, పత్రాలు అందజేశారు. ఇంకా గమనార్హమైన బి ఆర్ ఎస్ అభ్యర్థికి మద్దతు పలికిన ఒకటో వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ఒగ్గు వెంకటమ్మ -మల్లేశం ఇది కౌన్సిల్‌లో బి ఆర్ ఎస్ కు అదనపు బలాన్ని ఇచ్చి, ఏకగ్రీవ ఎన్నికకు దోహదపడింది.ఈ సందర్భంగా బిఆ ర్ఎస్ పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చితు సంబరాలలో మునిగితేలారు.



జేబీ ట్రేడర్స్ లో అగ్నిప్రమాదం

- **పది లక్షల ఆస్తి నష్టం**

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి, 16: చేగుంట మండల కేంద్రంలోని టీ టైమ్ ఎదురుగా రహదాలపై ఉన్న జేబీ ట్రేడర్స్ లో అగ్నిప్రమాదం చోటుచేసుకుని పది లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. పక్కనే ఉన్న వెల్డింగ్ షాప్ లో వెల్డింగ్ చేస్తున్న క్రమంలో వెల్డింగ్ రాపిడి కారణంగా అగ్నిప్రమాదం జరిగినట్లు బాధితులు ఆరోపించారు. తీవ్ర మంటలు చెలరేగడంతో మెదక్ ఫైర్ ఇంజన్ ద్వారా మంటలు మార్పే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అప్పటికే ఎక్కువ శాతం కాలి బూడిదయింది.



ఏడుపాయల జాతరకు భారీగా భక్తులు

- **తొక్కిసలాటలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు**
- **ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి**
- **జాతర ప్రాంతమంతటా నిరంతర నిఘా, కట్టుదిట్టమైన భద్రత**
- **బండ్ల ఊరేగింపు సందర్భంగా పోలీస్ బందోబస్తు పరిశీలన**
- **మెదక్ అదనపు ఎస్పీ మహేందర్**

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి16: ఏడుపాయల వన దుర్గామాత జాతర సందర్భంగా సోమవారం బండ్ల ఊరే గింపును పురస్కరించుకొని అదనపు ఎస్పీ మహేందర్ జాతర ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును స్వయంగా పరిశీలించారు.బండ్ల ఊరేగింపు మార్గం, భక్తుల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఏడుపాయల వన దుర్గామాత జాతర రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మ కంగా నిర్వహించబడుతుండటంతో, బండ్ల ఊరేగింపు ను తిలకించేందుకు వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు.ఈ నేపథ్యంలో ఎలాంటి తొక్కిసలాటలు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టా లని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధంగా నియంత్రించడం, పార్కింగ్ ప్రాంతాల్లో సిబ్బందిని ని యమించడం, క్యూలైన్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.జాతర ప్రాంతమంతటా నిరంతర పోలీస్ నిఘా కొనసాగిస్తూ, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. జాతరను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేం దుకు పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని అదనపు ఎస్పీ తెలిపారు.

మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ గా ధరణి మధుకర్

- **డిప్యూటీ మేయర్ గా సల్ల రమ్య**

ప్రతిపక్షం, మంచిర్యాల ఫిబ్రవరి 16 : మంచిర్యాల కార్పొరేషన్ మేయర్గా ధరణి మధుకర్ డిప్యూటీ మేయర్ గా సల్ల రమ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు మొదటగా మంచిర్యాల కార్పొరేషన్ కార్యాలయంలో ఆల్ఫాబెటికల్ ఆర్డర్ ప్రకారం మంచిర్యాల ఆర్డీవో ఒక్కొక్క కార్పొరేటర్ తో ప్రమాణస్వీ కారం చేయించారు మంచిర్యాల కార్పొరేషన్ లో 60 మంది కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ విప్పు ఆదే శాలతో ధన్యవాదాలు బలపరిచినట్లు ఆర్డీవో పేర్కొన్నారు అనంతరం మిగతా సభ్యులు ఆయన బలపరుస్తూ తమ మద్దతును తెలియజేశారు అనంతరం డిప్యూటీ మేయర్ గా చల్ల రమ్యను తమ మద్దతుదారులు ఏకగ్రీవంగా తీర్మా నించారు ఎవరు మేయర్గా ఉపమేయరుగా పోటీ లేనందున అందరూ ఆమోదించారు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఎన్నికల పర్యవేక్షణ గంగాధర్ ఐఏఎస్ సమక్షంలో ఈ నియామకం జరిగింది అనంతరం మేయర్ అభ్యర్థి ధరణి మధుకర్ ఉపమేయర్ చల్లారమ్యా ప్రత్యేకమైన వాహనంలో ఊరేగి ఊరేగింపుగా బయలుదేరి



పురవీధుల గుండా తమ ర్యాలీ కొనసాగి స్తూ అభిమాను లకు శుభాకాంక్షలు తెలిపారు సందర్భంగా పెద్ద ఎత్తున అభిమానులు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మార్వో రహమతుల్లా బేగ్ హాజీపూర్ ఎంఆర్ఓ శ్రీనివాస్ మంచిర్యాల ఏసిపి ప్రకాష్ సిఐ ప్రమోద్ రావు తదితరులు పాల్గొన్నారు..

తూప్రాన్ మున్సిపాలిటిపై గులాబీ జెండా

- **బీజేపీ మద్దతు ఆసక్తికరం**

ప్రతిపక్షం, గజ్వేల్ (తూప్రాన్), ఫిబ్రవరి 16: తూప్రాన్ మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు స్థానిక రాజకీయాలకు కొత్త దిశను చూపించాయి. చైర్మన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన బొంది రజినీ, వైస్ చైర్మన్‌గా కొక్కొండ సమత ఎన్నికవడం బీఆర్ఎస్ పార్టీ గెలుచు కొని ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించింది. మున్సిపల్ కౌన్సిల్‌లో 9 స్థానాలతో మెజారిటీ కలిగివున్న ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు ఊహించని మలుపులు తీసుకున్నాయి. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థి మన్నె స్వామి మద్దతు తెలపడం ద్వారా స్థానికంగా కొత్త రాజకీయ సందేశం వెళ్లింది. ఎన్నికల ముందు వరకు బీఆర్ఎస్‌లో ఏకగ్రీవత ఉందనే భావన ఉన్నప్పటికీ, చైర్మన్ ఓటింగ్ సమయంలో కొన్ని అసంతృప్తి స్వరాలు వినిపించాయి. ముఖ్యంగా చెలిమెల కుమ్మరి ప్రియాంక వ్యవహారం చర్చనీయాంశమైంది. చైర్మన్ ఎన్నికలో ఆమె వైఖరి వేరుగా ఉండగా, వైస్ చైర్మన్ ఎన్నికలో మద్దతు తెలపడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకె త్తించింది. ఇది కేవలం వ్యక్తిగత రాజకీయ వ్యూహమా?




లేక భవిష్యత్ మున్సిపల్ పాలనలో కీలక స్థానాన్ని దక్కిం చుకోవడానికి వేసిన బలమైన అడుగా? అన్న చర్చలు కొ నసాగుతున్నాయి. బీఆర్ఎస్ - బీజేపీ సమీకరణ తాత్కా లికమా? వ్యూహాత్మకమా? సాధారణంగా రాష్ట్ర స్థాయిలో పరస్పర విభేదాలు ఉన్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య స్థానిక స్థాయిలో వచ్చిన ఈ సమీకరణం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది కేవలం వ్యక్తిగత సంబంధాల ఫలితమా? లేక రాబోయే రాజకీయ పరిణా మాలకు సంకేతమా? అన్న ప్రశ్న ఉత్కంఠ నెలకొంది. ఇది లాఉండగా,ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డిఓ మైపాల్, మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి మున్సిపల్ మేనేజర్ శ్రీకాంత్, టి పి ఎస్ పావని రావు, తో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,

“



యాక్టర్‌గా ఉండటమంటే సన్యాసిగా జీవించడం లాంటిదే. తిండి, నిద్ర వదులుకోవాలని, ఫోకస్డ్‌గా ఉండాలి. నాకు పీఆర్ టీమ్ లేదు. నాపై వచ్చిన రూమర్స్ ఫ్రీ పబ్లిసిటీ తెచ్చిపెట్టాయి. రూ10 కోట్లు పెట్టినా ఇంత పబ్లిసిటీ వచ్చేది కాదు. రూమర్స్‌ను పట్టించుకుంటే కెరీర్‌పై ఫోకస్ చేయలేను.

- హీరోయిన్ మృణాల్ ఠాకూర్



దుబ్బాక మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్‌లను సన్మానించిన రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్

ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 16: ఇటీవల దుబ్బాక మున్సిపల్ ఎన్నికలలో గెలుపొంది సోమవారం చైర్ పర్సన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన శ్రీరామ్ సంగీతరవిందర్ లను, అలాగే వైస్ చైర్పర్సన్ ఆస సులోచన స్వామి లను రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషను చైర్మెన్ బక్కి వెంకటయ్య శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజలకు మంచి సేవలను అందించాలని కోరారు. అనంతరం చైర్మన్ వెంకటయ్య కు పలువురు ప్రజా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పంతం నెగ్గి పట్టు సాధించుకున్న 'ప్రతాప్'

- ఉద్యమకారునికి 'ఉప'తో ఊరడింపు
- మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ గా మహిళలే
- ప్రమాణస్వీకారం చేయించిన గజ్వేల్ ఆర్డిఓ చంద్రకళ



ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 16: గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మునిసిపల్ పీఠంపై పూర్తి ఆదిక్యత సాధించుకున్న బిఆర్ఎస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి ఎంపికలో "ప్రతిపక్షం" దినపత్రిక ఊహించినట్లు గానే నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ ప్రతాప్ రెడ్డి సూచనలతో తన అనుచరుడైన గంగిశెట్టి చందన రవి సోమవారం నాడు స్థానిక మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ గా ఎంపికతో గజ్వేల్ ఆర్డిఓ చంద్రకళ ప్రమాణ స్వీకారం చేయించారు. మునిసిపల్ ఫలితాలు వెలబడిన నాటినుండి బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు వారి వారి అభ్యర్థులను కట్టుబాటు చేసుకున్నారు. అయినా అవకాశం కోసం కాంగ్రెస్ పార్టీ ఆశించిన లభించక పోవడంతో వారు మౌనం వహించారు. ఇక బిఆర్ఎస్ నుండి విజయం సాధించిన 11 మంది అభ్యర్థుల తో మాజీ మంత్రి హరీష్ రావు మంతనాలు జరిపి పార్టీకి నష్టం కాకుండా ముందు చూపుతో కౌన్సిలర్ల సూచనతో అభ్యర్థిని ఎంపిక చేసినట్లు తెలుస్తుంది. ఇక తెలంగాణ ఉద్యమకారుడు కళ్యాణ్ కార్ నర్సింగరావు భార్య పద్మాబాయి చైర్మన్ పదవిని ఆశించిన పార్టీ హై కమాండ్ నిర్ణయాన్ని శిరసావహిస్తూ వైస్ చైర్మన్ గా ఎన్నిక కావడంతో గజ్వేల్ మున్సిపల్ పై చిక్కుముడి విడింది. మున్సిపల్ 20 వార్డ్ నుండి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన అత్తిలి శ్రీనివాస్, 4 వార్డ్ బిజెపి అభ్యర్థి రొట్టెల సురేష్ సైతం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వడం తో ఎన్నికల ప్రక్రియ సాదాసీదాగా జరిగింది. కార్యక్రమం అంతా గజ్వేల్ ఆర్డిఓ చంద్రకళ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం నిర్వహించారు. దీంతో రాబోయే రోజుల్లో ఎన్నికైన కౌన్సిలర్ ద్వారా ఎన్నికకాబడే కో ఆప్షన్ అభ్యర్థుల ఎంపిక ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉండగా క్రమశిక్షణ గల కార్యకర్తగా గత 15 ఏళ్లుగా పార్టీ కొరకు పనిచేస్తున్న నర్సింగరావు కుటుంబానికి చైర్మన్ పదవి దక్కకపోవడంతో వారి కుటుంబం తీవ్ర ఆవేదనకు లోన్ అయిందని చెప్పొచ్చు. ఏది ఏమైనప్పటికీ మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రశాంత వాతావరణంలో జరిగింది.



ఒంటరిగా పొలాలకు, అటవీ ప్రాంతాలకు వెళ్లవద్దు

- సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 16: చౌడారాం, గుండారాం గుట్టల ప్రాంతాల్లో పులి సంచారం ఉన్నట్లు సమాచారం రావడంతో స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. చిన్నకోడూర్ మండల పరిధిలోని ఈ ప్రాంతాలను సిద్దిపేట రూరల్ సి.ఐ. శ్రీను, ఎస్.ఐ. చంద్రమోహన్ కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అటవీ శాఖ అధికారులు, పూణే నుండి వచ్చిన ప్రత్యేక రెస్క్యూ బృందంతో చర్చించి పరిస్థితిని సమీక్షించారు.పులి కదలికల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా చౌదారం, గుండారం వైపు నుండి అటవీ ప్రాంతానికి వెళ్లే రెండు ప్రధాన మార్గాలను తాత్కాలికంగా మూసివేశారు. ప్రజలు, ముఖ్యంగా గొర్రెల కాపరులు, రైతులు అడవిలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. శుక్రవారం ఒక దూడను చెట్టుకు కట్టేసిన ప్రాంతంలో పులి సంచరించినట్లు నిర్ధారించబడింది.ప్రస్తుతం ప్రత్యేక రెస్క్యూ బృందం పులిని పట్టుకునే ప్రయత్నాల్లో నిమగ్నమై ఉంది. ఈ నేపథ్యంలో విఠలపూర్, గంగాపూర్, మాచాపూర్, కిస్టాపూర్, మల్లారం, అనంతసాగర్, రంగాయి పల్లి, ఏళ్ళాయి పల్లి, కమ్మర్లపల్లి, మైలారం, అల్లిపూర్ గ్రామాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. వన్యప్రాణి సంరక్షణతో పాటు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసు అటవీ శాఖ అధికారులకు సహకరించాలని సి.ఐ. శ్రీను విజ్ఞప్తి చేశారు. ఒంటరిగా పొలాలకు లేదా అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు.



కష్ట కాలంలో అండగా నిలబడ్డారు

- దుబ్బాక ప్రజల రుణం తీర్చుకోలేనిది
- మున్సిపల్ పాలకవర్గం కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 16: అధికారంలో లేకున్నా కష్ట కాలంలో దుబ్బాక పట్టణ ప్రజలు మున్సిపోల్స్ లో బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచారని, వారి రుణం తీర్చుకోలేనిదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. దుబ్బాక మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన శ్రీరాం సంగీత రవీందర్ మున్సిపల్ చైర్ పర్సన్ గా,వైస్ చైర్ పర్సన్ గా అస సులోచన స్వామిలు పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే వార్డు సభ్యులను సైతం సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దుబ్బాక మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ ఎస్ అభ్యర్థుల విజయానికి సహకారం అందించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి వర్యులు తన్నీరు హరీశ్ రావు, వార్డు ఇంచార్జిలకు, ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అధికారంలో లేకున్నా కెసిఆర్ చేసిన పనులు ప్రజల గుండెల్లో నిలిచి పోయాయాని మున్సిపోల్స్ లో నిరూపించడం జరిగిందన్నారు. ఎన్నికలు అయిపోయాయని, రాజకీయాలు పక్కన పెట్టి దుబ్బాక పట్టణ అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఈ సందర్భంగా తమకు చైర్మన్, వైస్ చైర్మన్ గా అవకాశం కల్పించిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కి, కౌన్సిలర్లకు, ఓటర్లకు మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీ రాం సంగీత రవీందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ అస సులోచన స్వామిలు కృతజ్ఞతలు తెలిపారు. దుబ్బాక పట్టణాభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని వారు పట్టణ ప్రజలకు హామీ ఇచ్చారు.





కొమురవెల్లిలో వైభవంగా పెద్దపట్నం

- ముగిసిన ప్రధాన ఘట్టం
- పసుపు(బండారి)మయంమైన ఆలయ ప్రాంగణం
- మల్లన్న నామస్మరణంతో మారుమోగిన తోట బావి ప్రాంగణం

ప్రతిపక్షం, కొమురవెల్లి ఫిబ్రవరి 16 : సిద్దిపేట జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా అత్యంత కీలక ఘట్టమైన పెద్దపట్నం వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినంను పురస్కరించుకుని ఆలయ అర్చకులు లింగోద్భవ కాలంలో ఆలయ గర్భగుడిలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం ఓగ్గు పూజారుల ఆధ్వర్యంలో తోటబావి వద్ద పెద్దపట్నం వేసి ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఓగ్గు పూజారులు 150 మంది ఆధ్వర్యంలో పెద్ద పట్నం వేశారు. పెద్దపట్నం కోసం క్వింటళ్ళ కొద్ది పసుపు, కుంకుమ,తెల్లపిండి, పచ్చ, గులాలు వినియోగించి పంచ వర్ణాలతో 41 వరుసల పెద్దపట్నం వేసి మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ గర్భగుడిలోని స్వామివారి ఉత్సవ విగ్రహాలను అర్చకులు ఊరేగింపుతో తోటబావి వద్దకు చేర్చారు. తోటబావి వద్ద పంచవర్ణాలతో వున్న పెద్ద పట్నంపై విగ్రహాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ముందుగా పెద్దపట్నంను ఉత్సవ విగ్రహాలతో అర్చకులు దాటగా అనంతరం భక్తులు ధాటి మల్లన్నను దర్శించుకున్నారు.

పెద్దపట్నం అత్యంత కీలకఘట్టం

జాతర బ్రామ్మోత్సవలలో భాగంగా మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే పెద్దపట్నంను అత్యంత కీలక ఘట్టంగా భక్తులు భవిస్తారు. పెద్ద పట్నంను చూసి, దాటెందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. అశేష భక్తులు,శివసత్తులు, పెద్దపట్నం దాటుతూ మల్లన్నను దర్శించుకోగా తోటబావి ప్రాంగణం మల్లన్న నామస్మరణంతో మారుమరోగింది. సుమారు 50 వేల మంది భక్తులు పెద్దపట్నం వేడుకలను తిలకించినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి.

భక్తులపై స్వల్ప లాఠీ ఛార్జి:

పెద్దపట్నం దాటే సమయంలో భక్తులు నాలుగు వైపుల నుండి అడ్డ దారిలో భారీ గేట్లు ఎక్కివచ్చేందుకు ప్రయత్నించిన వారిని నిలువరించేందుకు భక్తులపై పోలీసులు స్వల్ప లాఠిఛార్జ్ చేశారు. భక్తులు ఎదురుగా దూసుకు రావడంతో భారీకేడ్లు విరిగి ఫైర్ పోలీసు కానిస్టేబుల్ కాలుకు గాయం కాగా అతడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ టంకశాల వెంకటేష్,ఆలయ ప్రధానార్చకులు మల్లికార్జున్,అర్చకులు, ఒగ్గుపూజారులు,ఏఈఓ బుద్ది శ్రీనివాస్,ఆలయ సిబ్బంది,ఉత్సవ కమిటీ చైర్మన్ గంగం నర్సింహారెడ్డి, ధర్మకర్తలు సార్ల లింగం,దుర్గయ్య సర్పంచ్ గొల్లపల్లి పద్మఆంజనేయులు,హుస్నాబాద్ ఏసీపీ సదానందం చేర్యాల సీ ఐ బానోతు రమేష్,కొమురవెల్లి ఎస్ ఐ టీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం కప్ ఆర్చరీలో రాష్ట్ర స్థాయికి ఎంపిక

- జిల్లా స్థాయిలో గోల్డ్ మెడల్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరీ16: సీఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా సిద్దిపేట జిల్లా స్థాయిలో జరిగిన ఆర్చరీ లో సిహెచ్ రశ్మిత రెడ్డి, పాతూరి హేమంత్ రెడ్డిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో బాలుర విభాగంలో పాతూరి హేమంత్ రెడ్డి, బాలికల విభాగంలో రశ్మితారెడ్డిలు అత్యధిక ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. వీరు ఇరువురు ఈనెల 19వ తేదీ నుండి ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలలో పాల్గొననున్నారు.



ఢిల్లీలో వైరం... గల్లీలో స్నేహం

- మెదక్ ప్రజలను మరోసారి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ.
- అధికారంలో లేకున్నా 15 సీట్లు గెలిచాం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి16 : ఢిల్లీలో కాంగ్రెస్, బిజెపి పార్టీలకు వైరమున్న మెదక్ బల్దియాలోకాంగ్రెస్ ,బిజెపి, బీఎస్పీ సహకరించుకోవడం అనైతిక చర్య అని మాజీ డిప్యూటీ స్పీకర్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు . నిత్యం కాంగ్రెస్, బిజెపి నాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తు పోసుకుంటూ... మెదక్ మున్సిపల్ పోరులో ఇరు పార్టీలు సహకరించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మరోసారి మెదక్ ప్రాంత ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని చెప్పారు. అభివృద్ధి పేరుతో ఎన్నికల రాగానే ఇష్టం వచ్చిన వాగ్దానాలు చేస్తూ ప్రజలను ప్రలోభ పెడుతుందని గుర్తు చేశారు. ఎన్నికల్లో అభ్యర్థులపై అట్రాసిటీ కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అభ్యర్థులను ప్రచారం చేయనీయకుండా చేశారని , కేవలం అధికారం కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని ఆరోపించారు. ప్రజలు గమనిస్తున్నారని , బిఆర్ఎస్ పై నమ్మకాన్ని ఉంచి కాంగ్రెస్ కన్నా అధిక స్థానాలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కెసిఆర్ ఆదేశాల మేరకు మెదక్ లో బిఆర్ఎస్ పార్టీ గట్టిగా పని చేసిందని అందుకే ప్రజలు ఆదరించి కాంగ్రెస్ కన్నా పెద్ద మెజార్టీతో సభ్యులను గెలిపించాలని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మెదక్ పట్టణాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మున్సిపల్ శాఖలో ఏ అవినీతి జరిగిన భయపడకుండా ప్రజల ముందు ఉంచుతామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ... విపరీతమైన డబ్బులు , మద్యం పంచడంలో కాంగ్రెస్ పార్టీ ముందుందని అన్నారు. బిఆర్ఎస్ కార్యకర్తలపై అధికార పార్టీ పోలీస్ అధికారులతో ఒత్తిడి చేసి ఓట్లను దెబ్బతీయాలని ఆలోచన చేసిందని , అలాంటి పట్టించుకోకుండా ప్రజలు స్పష్టంగా బిఆర్ ఎస్ పార్టీకి మెజార్టీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజలు విశ్వసించి కాంగ్రెస్ కన్నా ఎక్కువ మెజార్టీతో కౌన్సిలర్లను గెలిపించడం కాంగ్రెస్ కు బుద్ధి చెప్పినట్లేనని అన్నారు. మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు విశ్వసించి పూర్తి మెజార్టీతో బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పియడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కెసిఆర్ సూచన మేరకు హరీష్ రావు, పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ పనిచేస్తుందని తెలిపారు. కంఠరెడ్డి. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మెదక్ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ కన్వినర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులుతోపాటు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లు రాజవ్వ,లలిత, స్వరూప, గంగామణి,జుబెర్ అహ్మద్, అనీస్ ఫాతిమా, సంధ్య, రాజశేఖర్, మహమ్మద్ గౌస్, శృతి,సోహెల్ మోహిద్దీన్, దీపక్, రాణి,ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

మెదక్ బల్దియా పీఠం కాంగ్రెస్ కైవసం

- సకాలంలో చేరుకున్న బీజేపీ, బీఎస్పీ కాంగ్రెస్ అభ్యర్థులు
- సమావేశానికి ఆలస్యంగా వచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థులు
- చైర్మన్ గా కానుగు రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ గా దొంతినరేష్ గౌడ్





ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి16 : మెదక్ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల అధికారులు మెదక్ మున్సిపల్ లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. చైర్పర్సన్ వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా జరిగిన ప్రత్యేక సమావేశానికి ఎన్నికకు స్పెషల్ ఆఫీసర్ గా వ్యవహరించిన జడ్పి సిఈఓ ఎల్లయ్య మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి జిల్లా అధికారి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పదవి ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికలు జరిగాయి చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుచుకున్న 14 మంది కౌన్సిలర్లతో పాటు బీఎస్పీ 1, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఎక్స్ అఫీషియో ఓటుతో చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ చేజిక్కించుకుంది .ముందుగా 32మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేపట్టారు తర్వాత నిర్వహించిన చైర్మన్ ఎన్నికలకు 24వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కానుగు రాధిక మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా 20వ వార్డు కౌన్సిలర్ మన్సూర్ ప్రతిపాదించారు.వారి ప్రతి పాదనను 19వ వార్డుకౌన్సిలర్ గంట సంపత్ బలపరిచారు . కాంగ్రెస్ పార్టీ తరఫున 14 మంది కౌన్సిలర్లు ఒక బీఎస్పీ కౌన్సిలర్ ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే రోహిత్ రావు చేతులెత్తి బలపరిచారు. బిజెపి సభ్యులు ఎన్నిక సమయంలో లేకపోవడంతో 30 మంది సభ్యులలో ఎమ్మెల్యే ఓటుతో కలిపి 16 ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థికి రావడంతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందినట్టుగా ఎన్నికల అధికారులు ప్రకటించారు .బిఆర్ఏస్ పార్టీ తరఫున మూడో వార్డు కౌన్సిలర్ కొట్టాల లలితను ఆ పార్టీ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు ప్రతిపాదించారు. బట్టి ఉదయకుమార్ బలపరిచారు వారికి సరిపోయిన అన్ని ఓట్లు లేకపోవడంతో ముందుగా 16 ఓట్లు వచ్చిన కానుగు రాధికను మున్సిపల్ చైర్మన్గా ఎన్నికైనట్లుగా అధికారులు ప్రకటించారు. అనంతరం బి ఆర్ఎస్ కౌన్సిలర్లు సమావేశ మందిరం నుండి బయటకు వెళ్లిపోయారు. కోరం ఉన్నందున వైస్ చైర్మన్ ఎన్నికను ఎన్నికల అధికారులు చేపట్టారు వైస్ చైర్మన్ అభ్యర్థిగా దొంతి నరేష్ గౌడ్ ను అరుణార్థి వెంకటరమణ ప్రతిపాదించారు. తోడుపునూరి శివరామకృష్ణ బలపరిచారు దీంతో వైస్ చైర్మన్ గా దొంతి నరేష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు .నూతనంగా ఎన్నికైన చైర్మన్ కానుగురాధిక దొంతి నరేష్ గౌడ్ లను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఘనంగా సత్కరించారు.రాబోయే రోజుల్లో అనేక అభివృద్ధిని చేసి చూపుతామని ఆయన తెలిపారు.

జర్నలిస్ట్ నుండి మెదక్ వైస్ చైర్మన్ గా

మెదక్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గా ఉన్న దొంతి నరేష్ గౌడ్ మెదక్ జిల్లా కేంద్రంలోని మెదక్ పట్టణంలోని వివిధ పత్రికలలో జర్నలిస్టుగా కొనసాగాడు ప్రస్తుతం సాక్షి దిన పత్రికలో పనిచేస్తూ మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా కొనసాగుతున్నాడు .మెదక్ 14 వ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచారు. దొంతి నరేష్ గౌడ్ అమ్మ లక్ష్మి ముత్యం గౌడ్ గతంలో మూడుసార్లు కౌన్సిలర్ గా గెలిచింది వారి నాన్న ముత్యం గౌడ్ కౌన్సిలర్ గా పని చేయడం జరిగింది రాజకీయ వారసత్వాన్ని కొనసాగుతున్న నరేష్ గౌడ్ కు జర్నలిస్టుగా పనిచేసిన అనుభవంతో మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆశీస్సులతో వైస్ చైర్మన్ పదవి దక్కడం ప్రజలు ఆనందంగా భావిస్తున్నారు



పాకిస్థాన్‌పై సాధించిన విజయం ఇండియాకు అంకితం. మేం ఎలా ఆడాలనుకున్నామో అదే బ్రాండ్ క్రికెట్ ఆడాం. ఈ పిచ్‌పై మొదట బ్యాటింగ్ చేయడమే మంచి ఆప్షన్. అభిషేక్ ఔటైన తర్వాత ఇషాన్ కిషన్ బాధ్యత తీసుకుని ఆడిన విధానం అద్భుతం. 155 కొట్టినా సరిపోతుందని అనుకున్నాం. బంతితో ప్రతి ఒక్కరూ రాణించారు.

- కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్

ప్రాంతీయం




మొయినాబాద్ మున్సిపల్ చైర్మన్ గా
షాబాద్ సోనియా దర్శన్ ఏకగ్రీవం

- **వైస్ చైర్మన్ గా గరుగు రాజు ఎన్నిక.**
- **ప్రమాణ స్వీకారం చేసిన కౌన్సిలర్లు**

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 16: మొయినాబాద్ మున్సిపాలిటీ చైర్మన్ గా షాబాద్ సోనియా దర్శన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొయినాబాద్ మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక జరిగింది. 25వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ దుబ్బ సోనియా దర్శన్ చైర్పర్సన్‌గా, 22వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ గరుగు రాజులు వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.సోమవారం మున్సిపల్ కార్యాలయ మందిరంలో నిర్వహించిన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అన్ని వార్డుల సభ్యులు హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ముందుగా కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించి, తర్వాత వైస్ చైర్మన్‌ను ఎన్నుకున్నారు.ఎన్నికైన చైర్పర్సన్ కు షాబాద్ సోనియా దర్శన్, వైస్ చైర్మన్ గరుగు రాజులకు ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించి వారికి ప్రొసీడింగ్ పత్రాలు అందించారు. అనంతరం ఎన్నికల అధికారి నూతన మున్సిపల్ పాలకవర్గానికి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వైస్ చైర్మన్ గా గరుగు రాజు ప్రమాణ స్వీకారం

మొయినాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ గా 22వ వార్డు కౌన్సిలర్ గరుగు రాజు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ గా, 22వ వార్డు కౌన్సిలర్ గరుగు రాజు వైస్ చైర్మన్ గా ప్రమాణం చేశారు. పట్టణంలోని 26 వార్డుల కౌన్సిలర్లు సైతం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ గరుగు రాజు మాట్లాడుతూ... ప్రజలు నమ్మకాన్ని వమ్ము చేయకుండా నా బాధ్యతను సక్రమంగా నిర్వహించి మున్సిపల్ లోని అన్ని వార్డులను చైర్ పర్సన్ తో కలిసి అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. వార్డుల అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తాని వెల్లడించారు.



వర్ధన్నపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం

- **చైర్మన్ గా పాలకుర్తి సారంగపాణి**
- **వైస్ చైర్మన్ గా నేతావత్ శిభారాణి ఎన్నిక**

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 16: వర్ధన్నపేట మున్సిపాలిటీ కైవసం చేసుకునే విధంగా కృషి చేసిన పార్టీ శ్రేణులు అందరికీ కృతజ్ఞతలు అభినందనలు తెలియజేసిన ఎమ్మెల్యే వర్ధన్నపేట మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్న నేపథ్యంలో గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యకర్తలు ,కాంగ్రెస్ పార్టీ జెండాలు ఎగురవేస్తూ, నినాదాలతో పట్టణం మార్మోగింది. ప్రజల ఆశీస్సులతో మున్సిపాలిటీ పీఠాన్ని గెలుచుకున్నామని, ఇది పార్టీ శ్రేణుల కృషి, కార్యకర్తల త్యాగాల ఫలితమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు అభివృద్ధికి అనుకూలమని, వర్ధన్నపేట పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన ప్రతి ఓటరికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పట్టణ అభివృద్ధికి సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. కొంతమంది వ్యక్తులు వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడి అసత్య ప్రచారాలు నిర్వహించినా ప్రజలు వాటిని తిరస్కరించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని ఆయన పేర్కొన్నారు. అధికార దుర్వినియోగం చేశామనే ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, తాము ఎప్పుడూ రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్య పద్ధతిలోనే పనిచేస్తామని స్పష్టం చేశారు. పేద, బలహీన వర్గాల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక పాలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. వర్ధన్నపేట కాంగ్రెస్ గెలుపులో కీలక పాత్ర పోషించిన హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆయూబ్కు, అలాగే మండలాధ్యక్షులు, పట్టణ నాయకులు, యువజన, మహిళా విభాగాల ప్రతినిధులకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. వర్ధన్నపేట పట్టణ ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అహర్నిశలు శ్రమించి వర్ధన్నపేటను రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు.




చిట్యాల మున్సిపాలిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

- **ఆశీర్వదించారు... అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే వేముల**
- **చైర్ పర్సన్ గా పందిరి గీత**

ప్రతిపక్షం, చిట్యాల, ఫిబ్రవరి 16: చిట్యాల మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా పందిరి గీత రమేష్, వైస్ చైర్ పర్సన్ గా గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు ఎన్నికయ్యారు. ముందుగా ఉదయం గం. 11:00 లకు 12 వార్డుల సభ్యులు నేను అనగా..... అంటూ ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపాలిటీ లోని 1 నుండి 12 వార్డులకు వరుసగా... నాగిళ్ల సుధాకర్, గాలి యాదమ్మ, కోనేటి ఎల్లయ్య, గుండెబోయిన శ్రీలక్ష్మి, జెర్రిపోతుల సత్యనారాయణ, కుక్కల లత, కుక్కల మోహన్, ఏర్పుల పరమేష్, నిమ్మనుకోటి శ్రీనివాస్, మునగాల సందీప, పందిరి గీత లు ప్రమాణ స్వీకారం చేశారు. మ. 12:30కి చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నికను అధికారులు పూర్తి చేశారు.

ఆశీర్వదించారు... అభివృద్ధికి కృషి చేస్తాం: ఎమ్మెల్యే వేముల

మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాలలో కూడా పార్టీని ఆదరించి, అభ్యర్థులను ఆశీర్వదించి అత్యధిక స్థానాల్లో గెలిపించారని, పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. స్థానిక కూడలిలో సోమవారం జరిగిన విజయోత్సవ సభలో ప్రజలను ఉద్దేశించి డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేతతో కలిసి మాట్లాడారు. ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఇకపై అభివృద్ధిపైనే దృష్టి పెడతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అలాగే అభినందన సభకు హాజరైన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారు సేవ చేయటం అనేది అదృష్టంగా భావించాలని సూచించారు.




పరకాల మున్సిపల్ చైర్మన్‌గా పావుశెట్టి సునీల్

- **వైస్ చైర్‌పర్సన్‌గా ఏకు దివ్య**

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 16: పరకాల మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ హాలులో నూతనంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. కౌన్సిలర్లకు డాక్టర్ కన్నం నారాయణ (ఆర్డీవో) ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో పాటు అధికారులు కౌన్సిలర్లను శాలువాలతో సన్మానించి ధ్రువపత్రాలను అందజేశారు. తదుపరి పురపాలక చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించబడింది. చైర్మన్ పదవికి కౌన్సిలర్లు ఏకగ్రీవంగా పావుశెట్టి సునీల్ కుమార్ను ప్రతిపాదించి బలపరిచారు. అలాగే వైస్ చైర్‌పర్సన్‌గా ఏకు దివ్యను ఎన్నుకున్నారు. అనంతరం ఇద్దరూ పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రవీందర్, టీపీఓ సుష్మ తదితర అధికారులు పాల్గొన్నారు. పరకాల పట్టణ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని నూతన చైర్మన్, వైస్ చైర్‌పర్సన్ పేర్కొన్నారు.



లారీ ఢీకొన్న స్కూల్ వ్యాన్.. తప్పిన ప్రమాదం

- **తృటిలో తప్పిన పెను ప్రమాదం**
- **50 మందికి పైగా విద్యార్థులు**
- **ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలు**

ప్రతిపక్షం, భీమదేవరపల్లి, ఫిబ్రవరి 15: మండలంలోని ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. స్కూల్ వ్యాన్‌ను లారీ ఢీకొనడంతో పెద్ద ప్రమాదం తృటిలో తప్పింది. వ్యాన్‌లో 50 మందికి పైగా విద్యార్థులు ఉండగా ఇద్దరు చిన్నారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎలా జరిగింది ప్రమాదం స్థానికుల వివరాల ప్రకారం, హుస్నాబాద్ నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న లారీ, కొత్తకొండ దిశ నుంచి వస్తున్న శ్రీ చైతన్య పాఠశాల స్కూల్ వ్యాన్‌ను యూటర్న్ తీసుకుంటున్న సమయంలో ఢీకొట్టింది. ఢీకొట్టడంతో వ్యాన్ క్లీనర్‌తో పాటు ఒక విద్యార్థిని కింద పడిపోయారు. మరో ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు విద్యార్థులను సురక్షితంగా వ్యాన్ నుంచి బయటకు దించారు. ఒక్కసారిగా జరిగిన ఘటనతో విద్యార్థులు భయంతో ఏడ్చిపోతుండగా సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఘటనాస్థలానికి చేరుకుని పిల్లల పరిస్థితి తెలుసుకున్నారు. ముల్కనూర్ అంబేద్కర్ కూడలిలో జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నప్పటికీ సరైన వెడల్పు లేకపోవడం, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి పెద్ద ప్రమాదం తప్పిందని, వెంటనే రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.





విధేతకు పట్టం.. నిజామాబాద్ మేయర్ గా ఉమారాణి

- **డిప్యూటీ మేయర్ సల్మా తహిసిన్**
- **ఓటింగ్ లో పాల్గొన్న పీసీసీ చీఫ్, రూరల్ ఎమ్మెల్యే**
- **హెలికాప్టర్లో మేయర్ అభ్యర్థి సీల్డ్ కవర్తో వచ్చిన మంత్రి ఉత్తమ్ పీసీసీ మహేష్**
- **బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలు కాంగ్రెస్ వే**




ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 16 : జిల్లాలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు, బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. నిజామాబాద్ మినహా మూడు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీకి చైర్మన్ల పదవి చేపట్టేందుకు స్పష్టమైన మెజార్టీ ఉండటంతో ఆ పార్టీ సునాసయంగా చైర్మన్ పదవీలను చేపట్టింది. మొత్తానికి మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది.

నిజామాబాద్ లో...

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నాల్గవ మేయర్ గా ఉమారాణి, డిప్యూటీ మేయర్ సల్మా తహసిన్లు ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశం ఇందుకు వేదిక అయ్యింది. మేయర్ అభ్యర్థి విషయంలో తర్జనభర్జనల మధ్య కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జి, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహే కుమార్ గౌడ్ లు సీల్డ్ కవర్ తో హెలికాప్టర్ లో వచ్చారు. నేరుగా మున్సిపల్ కు చేరుకున్న వారు ప్రత్యేక సమావేశంలో సీల్డ్ కవర్లో పంపిన పేరును మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. ఆ మేరకు మేయర్ గా 49వ డివిజన్ నుంచి కార్పొరేటర్ గా గెలిచిన ఉమారాణి ఎన్నికయ్యింది. అలాగే కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చిన ఎంఐఎం పార్టీకి చెందిన సల్మా తహసిన్ కు డిప్యూటీ మేయర్ పదవి ఇచ్చారు. అనంతరం నూతనంగా గెలిచిన కార్పొరేటర్లతో మున్సిపల్ అధికారులు ప్రమాణా స్వీకారం చేయించారు. అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరుగగా వారు బాధ్యతలు స్వీకరించారు.

విధేయుడికే పట్టం...

నిజామాబాద్ నగరానికి చెందిన మహేష్ కుమార్ గౌడ్ రాజకీయల్లోకి రాకముందు కరాటే మాస్టర్. ఈయన వద్ద రమేష్(కొత్త మేయర్ ఉమారాణి భర్త) శిష్యుడిగా పనిచేశారు. పైగా వీరిద్దరి మధ్య 40 యేండ్ల స్నేహబంధం ఉంది. మహేష్ రమేష్ బాగా నమ్మకమైన వ్యక్తి కావటంతో రమేష్ భార్యకు కార్పొరేటర్ టిక్కెట్టు ఇచ్చారు. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ నుంచి మేయర్ అభ్యర్థిగా 19వ డివిజన్ నుంచి బరిలోకి దిగిన శమంత రెడ్డి ఓటమి చెందటం పీసీసీ ఛీఫ్ తన స్నేహితుడు రమేష్ భార్య ఉమారాణి గెలుపొందటంతో ఆమె వైపు మొగ్గుచూపారు. రమేష్ సుధీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతుండటంతో మేయర్ గా ఉమారాణిను అందరూ సమర్ధించారు. పైగా ముదిరాజ్ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు ఏమి చేయలేక పోవటం, నగరంలో ముదిరాజ్ ప్రాబల్యం ఎక్కువగా ఉండటంతో ఉమారాణికి ఈ అవకాశం ఇచ్చి ముదిరాజ్ వర్గానికి న్యాయం చేసినట్లు అయ్యింది.

బోధన్ లో....

జిల్లాలోని బోధన్ మున్సిపాలిటీలో జరిగిన చైర్మన్ ఎన్నికలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంది. చివరకు కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. చైర్మన్ గా తూము పద్మవతి, వైస్ చైర్మన్ గా ఎంఐఎం కౌన్సిలర్ మీర్ ఇలియాజ్ ప్రమాణా స్వీకారం చేశారు. ఇక్కడ మొత్తం 38 వార్డులు ఉండగా చైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్ 17, ఎంఐఎం 12 స్థానాలో గెలుపొందారు. స్వతంత్ర్య సభ్యుల, ఎక్స్‌అఫిషియల్ సభ్యులతో కలిసి 31 మంది మద్దతు లభించింది. దాంతో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ చైర్మన్ గా ఎన్నికయ్యింది. ఈ మున్సిపాలిటీలో వాస్తవానికి మొదట చైర్మన్ గా శరత్ రెడ్డి పేరును ప్రతిపాదించారు. కానీ, స్థానిక ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఈ సారి జనరల్ కోటాలో ఉన్న చైర్మన్ పదవిని బీసీ వర్గానికి కేటాయిస్తే సామాజిక, సమతుల్యత ఉంటుందని భావించి తూము పద్మవతిను ఎంపిక చేసినట్లు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వెల్లడించారు.

ఆర్మూర్ లో ...

ఆర్మూర్ మున్సిపాలిటీలో గోనె లహరి రఘు, వైస్ చైర్మన్ గా కాట్పల్లి వెంకట్ రెడ్డి లు ఎన్నికయ్యారు. ఆర్మూర్ మున్సిపాలిటి ప్రత్యేక సమావేశం ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ ఎన్నికల అధికారుల సమక్షంలో పోలీసుల బందోబస్తు నడమ ప్రశాంతంగా జరిగింది. ఆర్మూర్ మొత్తం 36 వార్డులు ఉండగా అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ 19 స్థానాలు గెలుచుకుని చైర్మన్ కు కావల్సిన మెజార్టీ సాధించింది.

భీంగల్ లో ....

భీంగల్ పట్టణంలో రెండవ సారి జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల అనంతరం సోమవారం ప్రత్యేక సమావేశం జరిగింది. చైర్మన్ గా బొదిరే నాగమణి, వైస్ చైర్మన్ గా జేజే లతా నర్సయ్యలు ఎన్నికయ్యారు. ఇక్కడ 12 వార్డులలో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 4 స్థానాల్లో గెలుపొందింది. చైర్మన్ కు అవసరమయ్యే సీట్లు ఉండటంతో చైర్మన్, వైస్ చైర్మన్ల పదవులను కాంగ్రెస్ పార్టీయే తన ఖాతాలో వేసుకుంది.

మూడు పార్టీలు ఒక్కటై బీజేపీను ఓడించాయి

- **ఈ ఫలితాన్ని త్వరలో తిరగరాస్తా**
- **ఎంపీ అరవింద్**



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 15 : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీలు ఏకమై బీజేపీను ఓడించిందని, ఈ పొత్తు అనైతిక పొత్తని జిల్లా ఎంపీ అరవింద్ ధర్మపురి విమర్శించారు. ఈ ఫలితాన్ని తాను త్వరలోనే తిరగరాస్తానని ఎంపీ అన్నారు. సోమవారం మేయర్ ఎన్నిక అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ బిజేపీను దెబ్బతీసేందుకు తమ పార్టీల సిద్ధాంతాలను పక్కనపెట్టి గెలిచాయని, ఇది ఒక గెలుపు కాదని ధ్వజమెత్తారు. ఈ అక్రమ పొత్తును ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ కారు రేసు వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కుటుంబాన్ని సీఎం రేవంత్రెడ్డి కాపాడుతున్నారనే దానికి ఇంతకంటే మంచి నిదర్శనం మరొకటి ఉండదన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ బీజేపీకి ఎంత దూరమో ఎంఐఎం పార్టీ కూడా సమదూరమన్న పీసీసీ చీఫ్ ఇప్పుడెందుకు దగ్గరై పొత్తు పెట్టుకున్నట్లు అని ప్రశ్నించారు. ఈ ఎన్నిక ప్రక్రియలో కొందరు పోలీస్ అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించారని ఎంపీ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్ ను కాంగ్రెస్ వాహనంలో ఎందుకు తీసుకువచ్చారో స్పష్టంగా కనిపించిందని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిందన్నారు. బీజేపీ మేయర్ అభ్యర్థి స్రవంతిరెడ్డి పై కాంగ్రెస్ అభ్యర్థి కేవలం మూడు ఓట్ల స్వల్ప తేడాతో విజయం సాధించిందని, అలాగే డిప్యూటీ మేయర్ ఎన్నిక విషయంలో తమ కార్పొరేటర్ బంటు రాముపై గెలవటం వెనుక కాంగ్రెస్ పన్నాగం ఉందని ఎంపీ ఆరోపణలు చేశారు. మేయర్ ఎన్నిక ఫలితం ముగిసిన అధ్యాయం కాదని, ఈ పాలకవర్గం గడువు ముగియక ముందే ఈ ఫలితాన్ని తాము రివర్స్ చేసి చూపిస్తామని స్పష్టం చేశారు ఎంపీ వెంట అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, నూతనంగా గెలిచిన కార్పొరేటర్ ఉన్నారు.

> యూఎస్ తో ట్రేడ్ డీల్‌తో కేంద్రం రైతులకు ద్రోహం చేస్తోందని రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు అర్థరహితం. రాహుల్ అబద్ధాలు వ్యాప్తి చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారు. రైతులు, మత్స్యకారుల ప్రయోజనాలను పూర్తిగా రక్షిస్తున్నాం. ఆందోళన చెందాల్సిన పని లేదు. రైతుల గురించి పార్లమెంటులో రాహుల్ మాట్లాడుతుంటే నవ్వొస్తోంది.
>
> - కేంద్ర మంత్రి అమిత్ షా

ప్రాంతీయం

రెండు మున్సిపాలిటీలు బీఆర్ఎస్ ఖాతాలోకి

- హైడ్రామా మధ్య ప్రశాంతంగా ఇస్నాపూర్ మున్సిపల్ ఎన్నిక
- ఇస్నాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గా మోటె సుమలత
- - వైస్ చైర్పర్సన్ గా పట్లోళ్ల మాధవి రెడ్డి
- హైడ్రామల మధ్య ప్రశాంతంగా ముగిసిన ఎన్నిక
- కోరం లేక ఇంద్రేశం మున్సిపల్ ఎన్నిక నేటికీ వాయిదా
- పటాన్ చెరు నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీలు బిఆర్ఎస్ కైవసం
- ఎమ్మెల్యే కారులో ఎంపీ రఘునందన్ రావు
- బుల్లెట్ దిగిందా లేదా......
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఎలాంటి ఆవంచనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు.





ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 16 : పటాన్ చెరువు మండలంలో ని రెండు మున్సిపాలిటీలు బిఆర్ఎస్ ఖాతాలోకి వెళ్లాయి. హై డ్రామాల మధ్య ఇస్నాపూర్ ఎన్నిక ప్రశాంతంగా ముగియగా, ఇంద్రేశం మున్సిపల్ ఎన్నిక కోరం లేక నేటికీ వాయిదా పడింది. పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ పురపాలక సంఘం పరిధిలోని లగ్దారం వార్డు కార్యాలయంలో సోమవారం ఇస్నాపూర్ పురపాలక సంఘం చైర్పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించారు. నాటకీయ పరిణామాల మధ్య కాంగ్రెస్, బిఆర్ఎస్ కౌన్సిల్ సభ్యులు ఉదయం 11 గంటలకు క్యాంపుల నుంచి నేరుగా బస్సులో వార్డు కార్యాలయానికి వచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక అదికృత అధికారి పి.శ్రీకాంత్ నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుండి నీలం కవిత ముదిరాజ్ కి 13 ఓట్లు, బీఆర్ఎస్ పార్టీ నుండి మోటే సుమలత కి 15 ఓట్లు వచ్చాయి. ఇందులో అధిక ఓట్లు వచ్చిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన మోటే సుమలత ఇస్నాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ గా అల్లంరెడ్డిగారి లక్ష్మికి 13 ఓట్లు, పట్లోళ్ల మాధవి రెడ్డికి 15 ఓట్లు రాగా పట్లోళ్ల మాధవి రెడ్డిని వైస్ చైర్ పర్సన్ గా ఎన్నుకున్నారు. చైర్ పర్సన్ మోటే సుమలత, వైస్ చైర్పర్సన్ పట్లోళ్ల మాధవి రెడ్డి లను పదవి ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా ఇరు పార్టీలకు 13 మంది చొప్పున సభ్యులు ఉండగా ఎక్స్ అఫీషియో ఓట్లను ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిలు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వటంతో బిఆర్ఎస్ బలం 15 కు చేరుకుంది.

ఒకే కారులో ఎమ్మెల్యే గూడెం, ఎంపీ రఘునందన్ రావు

ఇస్నాపూర్ పురపాలక సంఘం ఎన్నికల్లో ఎక్స్ అఫీషియో ఓట్లు కీలకమయ్యాయి. కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలకు చెరో 13 మంది కౌన్సిల్ సభ్యులు లు ఉండడంతో వీరిద్దరి ఓట్లు కీలకం అయిన తరుణంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కారులోనే ఎంపీ రఘునందన్ రావు తన ఓటు ను వినియోగించుకునేందుకు వచ్చారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఓటు వేసి కారు ఎక్కి వెళ్లిపోయే సమయంలో విలేకరులు అడగగా బుల్లెట్ దిగిందా లేదా అని చమత్కరించారు.ఇస్నాపూర్ మున్సిపల్ చైర్పర్సన్ ఎన్నిక సందర్భంగా ఎలాంటి ఆవంచనీయ సంఘటనలు జరగకుండా సైబరాబాద్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

కోరం లేక నేటికీ వాయిదా పడ్డ ఇంద్రేశం మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక

ఇస్నాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక పలు నాటకీయ పరిణామాల మధ్య ప్రశాంతంగా జరగగా, ఇంద్రేశం మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక కోరం లేక నేటికీ(మంగళవారం) వాయిదా పడింది. ఆరు మంది కాంగ్రెస్ సభ్యులు కౌన్సిలర్ గా ప్రమాణ స్వీకారం చేయగా, బిఆర్ఎస్, బిజెపి సభ్యులు రాకపోవటంతో వాయిదా వేసినట్లు ఎన్నిక అదికృత అధికారి రామాచారి తెలిపారు.





ప్రశాంతంగా మున్సిపల్ ప్రత్యేక సమావేశాలు

- తొమ్మిది మున్సిపాలిటీల చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక పూర్తి
- సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన అధికారులు
- జహీరాబాద్, ఇంద్రేశం చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక రేపటికి వాయిదా

ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి , ఫిబ్రవరి 16 : సంగారెడ్డి జిల్లాలోని 11 మున్సిపాలిటీలకు ప్రత్యేక సమావేశాలు ప్రశాంతంగా ముగిశాయి. నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం,చైర్ పర్సన్ , వైస్ చైర్ పర్సన్ ఎన్నిక కోసం నిర్వహించిన ఈ ప్రత్యేక సమావేశాలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య మార్గ నిర్దేశంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సంగారెడ్డి మున్సిపల్ ప్రత్యేక సమావేశం అదీకృత అధికారి జడ్పీ సీఈవో జానకి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఉదయం 11 గంటలకు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో ప్రత్యేక సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఆయా పార్టీల సభ్యులు సమావేశ మందిరాలలోకి చేరుకోగా, తెలుగు అక్షరమాలను అనుసరిస్తూ వరుస క్రమంలో నూతనంగా ఎన్నికైన సభ్యులతో అధీకృత అధికారులు ముందుగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం నిబంధనల మేరకు, పారదర్శకంగా పూర్తయ్యింది. జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, అందోల్ -జోగిపేట్, కోహిర్, నారాయణఖేడ్, ఇస్నాపూర్, గుమ్మడిదల గడ్డపోతారం, జిన్నారం మున్సిపాలిటీలలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు సజావుగా పూర్తయ్యాయి. అయితే జహీరాబాద్, ఇంద్రేశం మున్సిపాలిటీలలో సరిపడా కోరం లేనందున ఆయా మున్సిపాలిటీల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. మున్సిపల్ కమిషనర్లు, అదీకృత అధికారుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించబడింది. ఉదయం 11 గంటలకు మొదటగా వార్డు సభ్యులుగా ఎన్నికైన సభ్యులందరికీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు సరి పడు కోరం ఉందని నిర్ధారించుకున్న మీదట ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు.చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించి, చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ లను అధికారికంగా ప్రకటించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ లతో ప్రమాణ స్వీకారం చేయించారు.

మున్సిపాలిటీ వారీగా చైర్మన్, వైస్ చైర్మన్‌ల వివరాలు:..

ఆందోల్ జోగిపేట్ : మున్సిపల్ చైర్మన్ గా సోమ్మిరెడ్డి గారి కృష్ణారెడ్డి,(కాంగ్రెస్) వైస్ చైర్మన్ గా ఆకుల సత్యనారాయణ(కాంగ్రెస్),

గడ్డపోతారం: చైర్ పర్సన్ గా గద్దె సుష్మ,(బి ఆర్ ఎస్), వైస్ చైర్మన్ గా లక్ష్మ గోని మహేందర్ గౌడ్ ((బి ఆర్ ఎస్)

గుమ్మడిదల: చైర్మన్ చిన్న పాపాని కుమార్ గౌడ్ (బి ఆర్ ఎస్) వైస్ చైర్ పర్సన్ గా చిమ్ముల సంధ్య(బి ఆర్ ఎస్)

ఇస్నాపూర్: చైర్ పర్సన్ గా శ్రీమతి మోతే సుమలత (బి ఆర్ ఎస్) వైస్ చైర్ పర్సన్ గా పట్లోళ్ల మాధవి (కాంగ్రెస్)

జిన్నారం: చైర్మన్ గా నక్కిర్తి యాట జనార్ధన్ (బిఆర్ఎస్) వైస్ చైర్మన్ గా వంగెట్టి ప్రతాప్ రెడ్డి (బీజేపీ)

కోహిర్: చైర్మన్గా ఎం. అశోక్ (కాంగ్రెస్), వైస్ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ హన్నన్ జావిద్ (కాంగ్రెస్)

నారాయణఖేడ్: చైర్మన్గా నగేష్ కుమార్ షట్కార్(కాంగ్రెస్), వైస్ చైర్మన్ గా దారం శంకర్ (కాంగ్రెస్)

సదాశివపేట్: మున్సిపల్ చైర్ పర్సన్ గా శ్రీమతి మునిపల్లి అంజమ్మ(కాంగ్రెస్) వైస్ చైర్మన్ గా శ్రీమతి హెచ్. రేణుక (కాంగ్రెస్)

సంగారెడ్డి : చైర్ పర్సన్ గా కూన వనిత (కాంగ్రెస్), వైస్ చైర్మన్ గా షేక్ షఫీ అహ్మద్ (కాంగ్రెస్) ఎన్నికయ్యారు.

సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన కూన వనిత INC

వైస్ చైర్మన్ గా ఎకగ్రీవంగా ఎన్నికైన షేక్ షఫీ అహమ్మద్ INC

ఇంద్రేశం, జహీరాబాద్ మున్సిపాలిటీలలో కోరం లేకపోవడంతో ఎన్నిక (తేది.17.02.2026)కి వాయిదా పడింది.

ప్రజలను కుటుంబంలా భావించి పని చేయండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలకు అవసరమైన నిధులు.
- గెలిచిన వార్డుకు రూ.8 కోట్లు
- సంగారెడ్డి, సదాశివపేటకు నిధుల వర్షం కురిపిస్తాం
- నాలుగు నెలల్లో పేదలకు ఇంటి స్థలాలు
- కాంగ్రెస్ గెలిచిన వార్డుల అభివృద్ధి నా బాధ్యత
- టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 16 : ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి పని చేయాలని టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ కౌన్సిలర్లకు సూచించారు. సంగారెడ్డి పట్టణంలోని రామ్ మందిర్ నివాసంలో ఆయన కౌన్సిలర్లతో సమావేశమయ్యారు. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ అభ్యర్థులకు స్పష్టమైన మెజారిటీ ఇచ్చిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో 38 వార్డులలో 22 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించారని, ఇద్దరు స్వతంత్రులు మద్దతు ఇవ్వడంతో మొత్తం బలం 24కు చేరిందన్నారు. సదాశివపేటలో 26 వార్డుల్లో 16 వార్డులను కాంగ్రెస్ గెలుచుకుందని పేర్కొన్నారు. గంజ్ మైదాన్‌లో నిర్వహించిన భారీ సభలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రతి గెలిచిన వార్డుకు రూ.8 కోట్లు నిధులు మంజూరు చేయిస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటానన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలకు అవసరమైన నిధులు తీసుకువస్తానని చెప్పారు. నాలుగు నెలల్లో పేదలకు ఇంటి స్థలాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇళ్ల నిర్మాణాల పేరుతో ఎవరైనా తన పేరు చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. అలాంటి చర్యలు జరిగితే సంబంధితులకు చెడ్డపేరు వస్తుందని, కౌన్సిలర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది వేధింపులు లేకుండా చూడాలని అన్నారు. ఓడిపోయిన వార్డుల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థులు తన దృష్టిలో అనధికారిక కౌన్సిలర్లేనని, ప్రత్యేక నిధుల కేటాయింపులో వారికి స్వేచ్ఛ ఉంటుందని తెలిపారు. అయితే కాంగ్రెస్ గెలవని వార్డుల అభివృద్ధి బాధ్యత తనది కాదని స్పష్టం చేశారు. కౌన్సిలర్లు ప్రతిరోజూ ఉదయం 11 గంటల కల్లా మున్సిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ప్రజల అవసరాలను కుటుంబ బాధ్యతగా భావించి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ రెండు మున్సిపాలిటీల విజయంలో కీలక పాత్ర పోషించిన పార్టీ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు, ఉచిత గృహ విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలు ఎన్నికల విజయానికి దోహదపడ్డాయని అన్నారు. సింగిల్ మెజారిటీతో రెండు మున్సిపాలిటీలను కాంగ్రెస్‌కు అప్పగించిన సంగారెడ్డి, సదాశివపేట ప్రజలకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.



ఐదు మున్సిపాలిటీల గెలుపు కేసీఆర్ కు గిఫ్ట్

- అధికార విభాగం ప్రభుత్వానికి కట్టుబానిసగా పనిచేస్తుంది.
- కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు బీఆర్ఎస్ కే పట్టం.
- హామీలలో కాంగ్రెస్ విఫలం
- మున్సిపాలిటీలకు రావాల్సిన నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేస్తాం
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్.
- పటాన్ చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కో ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 16 : పటాన్ చెరు నియోజకవర్గంలోని ఐదు మునిసిపాలిటీల గెలుపును బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు గిఫ్ట్ గా ఇస్తున్నామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, పటాన్ చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కో ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డిలు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు బీఆర్ఎస్ కే పట్టం కట్టారని స్పష్టం చేశారు. సోమవారం రామచంద్రాపురం పట్టణం బీరంగూడ కమాన్ వద్ద ఆదర్శ్ రెడ్డి నివాసంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్ రావు సలహా సూచనలతో ఐదు మున్సిపాలిటీలను బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం జరిగిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, ఐదు మున్సిపాలిటీల ఇంచార్జిల కృషితో ఐదు మున్సిపాలిటీలకు బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ చైర్మన్లు ఎన్నికవ్వడం మాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం 420 హామీలు గుప్పించి ఇప్పటికీ ఏ వాగ్దానం నెరవేర్చలేదని విమర్శించారు. అధికార దుర్వినియోగానికి కాంగ్రెస్ ప్రభుత్వం దిగిందని అన్నారు. బీఆర్ఎస్ తరఫున కౌన్సిలర్ గా గెలిచిన కౌన్సిలర్లను కౌంటింగ్ కేంద్రాల నుంచి కిడ్నాప్ చేయటం ఎంత వరకు సమంజసం అన్నారు. ఇప్పుడు జరుగుతున్న అవినీతికి, గతంలో జరిగిన అభివృద్ధికి మధ్య జరిగిన పోరులో అభివృద్ధి విజయం సాధించిందని చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీలకు రావాల్సిన నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేస్తాం అన్నారు. పోలీస్, అధికార విభాగం ప్రభుత్వానికి కట్టుబానిసగా పనిచేస్తుందని విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి విలువైన భూములపై ముఖ్యమంత్రి, ఆయన అనుచరులకు కన్ను పడిందని ఆరోపించారు. అవినీతికి తెరలేపింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసిలు గడీల శ్రీకాంత్ గౌడ్, కొలన్ బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు పట్నం మాణిక్యం, గోసుల శ్రీనివాస్, తొంట అంజయ్య యాదవ్, ఏనుగు శ్రీనివాస్ రెడ్డి, మేరాజ్ ఖాన్, మాణిక్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.





నైతిక విజయం కాంగ్రెస్ దే

- బీఆర్ఎస్ ,బీజేపీ అనైతిక రాజకీయాలు
- బీసీ బిడ్డను ఎదగనియ్యకుండా పన్నాగాలు
- మెడలు పట్టి గెంటేసినా పార్టీ కి ఎంపీ రఘునందన్ మద్దతు
- ఓటమితో కుంగిపోయేది లేదు
- కలిసికట్టుగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తాం.
- పదమూడు మంది కౌన్సిలర్లను ఘనంగా సన్మానించిన నీలం
- వారి పోరాటానికి, ఐకమత్యానికి అభినందనలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 16 : ఇస్నాపూర్ మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నికలో నైతిక విజయం కాంగ్రెస్ పార్టీదేనని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.సోమవారం ఇస్నాపూర్ మున్సిపల్ ఎన్నికల చైర్మన్ ఎన్నిక అనంతరం ఆయన ప్రెస్ నోట్ విడుదల చేశారు. బీసీ బిడ్డ ఎదుగుదలను ఓర్చుకోలేక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు కుమ్మక్కు రాజకీయాలకు తెర లేపారని ఆరోపించారు. పొద్దున లేస్తే టీవీ ఛానల్లో బీఆర్ఎస్ పై హరీష్‌రావు పై ఆరోపణలు చేసే దొర రఘునందన్ రావు మళ్ళీ ఆ దొర కాళ్ళ దగ్గర బానిసగా మరిపోయాడని విమర్శించారు. దీన్నిబట్టి ఎంపీ ఎన్నికల్లో హరీష్‌రావు, రఘునందన్ రావు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అనైతిక బంధం నేడు బట్టబయలు అయిందని తెలిపారు. ఎంపీ. ఎం.రఘునందన్ మెడలు పట్టి బయటకు గెంటిన పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో ఎక్స్ అఫిషియో ఓటు వేయడం ఆయన మనస్సాక్షికే వదిలేస్తున్నామని వ్యాఖ్యానించారు. ఓటమితో కలత చెంది కుంగిపోయే మనస్తత్వం తనది కాదని మళ్లీ ప్రజాక్షేత్రంలో ప్రజల కోసం పనిచేసే కాంగ్రెస్ అభివృద్ధి కోసం కష్టపడతామని స్పష్టం చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన కౌన్సిలర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి ఘనంగా సత్కరించారు. చైర్మన్ సీటు చేజారినంత మాత్రాన కార్యకర్తలు ఎవరు నిరుత్సాహ పడవద్దని రాష్ట్రంలో మన కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని ప్రభుత్వ సహకారంతో ప్రజలకు కావలసిన అభివృద్ధి కార్యక్రమాలను సాధించుకుందామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేసిన ప్రజలందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు..

రసాయన శాస్త్రంలో కుమారస్వామికి పీహెచ్.డీ



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 16 : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి సాదినేని కుమార స్వామి డాక్టరేట్ కు అర్హత సాధించారు. '1,2,3ట్రయాజోల్ ఉత్పన్నాల రూపకల్పన, సంశ్లేషణ, ఔషధ మూల్యాంకనం, ఇన్‌సిలికో డాకింగ్ అధ్యయనాలు' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్ బాబు హరిదాస్యం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. కుమారస్వామి చేసిన డాక్టోరల్ పరిశోధన, ఆశాజనకమైన యాంటీమైక్రోబయల్, క్యాన్సర్ నిరోధక సామర్థ్యంతో కూడిన నూతన ట్రయాజోల్‌ఆధారిత టెట్రాజోల్, ఇమిడాజోల్ ఉత్పన్నాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. ఔషధ రసాయన శాస్త్రంలో కొత్త చికిత్సా అభ్యర్థులను అన్వేషించడానికి ఆయన అధ్యయనం అధునాతన డిజైన్, సంశ్లేషణ, ఔషధపోలిక విశ్లేషణ, ఫార్మాకోఫోర్ మోడలింగ్, మాలిక్యులర్ డాకింగ్ పద్ధతులను ఏకీకృతం చేస్తుందని వివరించారు. కుమారస్వామి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విజయం ప్రపంచ ఆరోగ్య సవాళ్లను పరిష్కరించే అధికప్రభావ శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణలకు గీతం యొక్క నిరంతర నిబద్ధతను చాటిచెబుతోందన్నారు. గీతం యొక్క విద్యా నైపుణ్యం, పరిశోధన కార్యక్రమాలకు హైదరాబాదు ఒక శక్తివంతమైన కేంద్రంగా కొనసాగుతోందని తెలిపారు.

"

దేశంలో రాజకీయ స్థిరత్వం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచింది. కొన్నేళ్లుగా 38 దేశాలతో 9 ట్రేడ్ డీల్స్ చేసుకున్నాం. టెక్స్‌టైల్స్, లెదర్, కెమికల్స్, హ్యాండ్‌క్రాఫ్ట్స్, జువెల్లరీ వంటి రంగాల్లో ఎంఎస్ఎంఈ మార్కెట్ విస్తరించింది. ఎగుమతిదారులకు కొత్త అవకాశాలు తెరుచుకున్నాయి. యూపీఏ హయాంలో ఆర్థిక నిర్వహణ సరిగ్గా లేక ఏ దేశంతోనూ చర్చించలేకపోయింది.

\- ప్రధాని నరేంద్ర మోదీ



దేశ వ్యాప్తంగా సీసీ కెమెరాలు

- కొద్ది రోజుల్లో 'జాతీయ భద్రతా నిర్మాణం': కేంద్ర హోం మంత్రి అమిత్ షా

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: డ్రగ్స్ రవాణాను అడ్డుకునేందుకు దేశవ్యాప్తంగా పటిష్ఠమైన 'సీసీటీవీ కెమెరాల నెట్ వర్క్'ను ఏర్పాటు చేయబోతున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. అంతేకాకుండా, దశాబ్దాలుగా దేశాన్ని భయపెడుతున్న నక్సలిజం సమస్యకు ఈ ఏడాది మార్చి 31 నాటికి శాశ్వతంగా చరమగీతం పాడబోతున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు భారతదేశ అంతర్గత భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఢిల్లీ పోలీసుల 79వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భవిష్యత్ కార్యాచరణను వివరించారు. "రాబోయే కొద్ది నెలల్లోనే కొత్త 'జాతీయ భద్రతా నిర్మాణాన్ని' ఏర్పాటు చేస్తాం. దీని ప్రధాన లక్ష్యం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడమే. ఇందుకోసం దేశంలోని అన్ని రాష్ట్రాలను కలుపుతూ ఒక భారీ సీసీటీవీ నెట్ వర్క్‌ను సృష్టిస్తాం. వీటిని పర్యవేక్షించడానికి 'ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్స్' ఏర్పాటు చేస్తాం. ఈ నిఘా వ్యవస్థకు చట్టపరమైన రక్షణ కూడా కల్పిస్తాం. దీనివల్ల డ్రగ్స్ నేరాలను రియల్ టైమ్‌లో పసిగట్టడం సులభమవుతుంది" అని షా అన్నారు. కేవలం అంతర్గత భద్రతే కాదు, సరిహద్దుల రక్షణపైనా కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందని షా తెలిపారు. "దేశంలోని ప్రతి భూ సరిహద్దులో భద్రతా ఏర్పాట్లను ఆధునీకరిస్తాం. నిఘా వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేస్తాం. ఫెన్సింగ్ (కంచె), ఇతర మౌలిక సదుపాయాలను బలపరుస్తాం. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు భద్రతా దళాల మధ్య సమన్వయం పెంచుతాం. అక్రమ ప్రవేశాలకు ఇక ఆస్కారం ఉండదు" అని తెలిపారు. అమిత్ షా తన ప్రసంగంలో మావోయిస్టుల ఏరివేతపై స్పష్టమైన డెడ్‌లైన్ విధించారు.

విశ్వ వీక్షణం



ఆలయాల్లో మహిళల ప్రవేశంపై వివక్ష కేసు

తొమ్మది మందితో సుప్రీం ధర్మాసనం ఏర్పాటు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: కేరళలోని శబరిమల ఆలయంతో సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళల ప్రవేశంపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును విచారించేందుకు తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. ఈ విచారణను ధర్మాసనం ఏప్రిల్ 7న ప్రారంభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమల్య బాగ్చి, విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం చెప్పింది. ఇది ఏప్రిల్ 22 నాటికి ముగిసే అవకాశం ఉందని పేర్కొంది. మహిళల ప్రవేశంపై నిషేధానికి సంబంధించి మార్చి 14లోపు లిఖితపూర్వక వాదనలను సమర్పించాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ఆలయ నిర్వాహకులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. శబరిమలతో పాటు మసీదులు, దర్గాలోకి మహిళల ప్రవేశంపై కూడా విచారించనుంది. అలాగే ఇతరులను పెళ్లి చేసుకున్న పార్సీ మహిళలకు మతపరమైన ప్రాంగణాల్లోకి ప్రవేశం లేకపోవడ వంటి అంశాలపై పరిగణనలోకి తీసుకుంది. అయితే నిర్ణయించిన షెడ్యూల్‌కు కట్టుబడి ఉండాలని అన్ని పక్షాలకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. 2019లో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే ఏర్పాటు చేసిన 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం సమీక్ష పిటిషన్ల నిర్వహణను ఇప్పటికే నిర్ణయించిందని తెలిపారు. అయితే కొవిడ్ కారణంగా ఈ అంశంపై విచారణలను అకస్మాత్తుగా రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. దాదాపు ఐదేళ్ల తర్వాత మరో కొత్త ధర్మాసనంతో దీనిపై విచారణ జరపనున్నట్లు వెల్లడించారు.



రొమాంటిక్ డెస్టినేషన్స్

దక్షిణ భారతదేశం జంటల కోసం రొమాంటిక్ డెస్టినేషన్స్‌తో నిండి ఉంది. ఈ స్థలాలు మీ సెలవులను చిరస్మరణీయంగా మార్చగలవు. ఈ శృంగారభరితమైన గమ్యస్థానాలు మీ సంబంధాన్ని మరింత లోతుగా చేయడమే కాకుండా జీవితంలోని సందడి నుండి దూరంగా శాంతి మరియు సంతోషాల అనుభవాన్ని కూడా అందిస్తాయి. మీకు అవకాశం దొరికినప్పుడల్లా, ఈ ప్రదేశాలను అన్వేషించడానికి మీరు తప్పక రావాలి.

సహజ వనరులతో కూడిన ప్రకృతి అందాలు, శాంతియుత వాతావరణం, సంస్కృతికి దక్షిణ భారత దేశం ప్రసిద్ధి. ప్రపంచం నలుమూలల ఎక్కువ మంది ఇక్కడికి రావడానికి ఉత్సాహం చూపడానికి ఇదే కారణం. ఇక్కడ పర్వతాలు, బీచ్‌లు, చారిత్రక ప్రదేశాలు హనీమూన్ ట్రిప్ కోసం సరైన గమ్యస్థానాల జాబితాలో చేర్చబడ్డాయి. మీరు కూడా మీ భాగస్వామితో విశ్రాంతి, రొమాంటిక్ క్షణాలను ఆస్వాదించాలనుకుంటే, దక్షిణ భారతదేశంలోని ఈ ప్రదేశాలు మీకు చాలా కంఫర్ట్‌గా ఉంటాయి. దక్షిణ భారతదేశంలో చూడదగిన కొన్ని ప్రదేశాల గురించి తెలుసుకోవడమే కాదు సందర్శించడమూ మంచిదే.

మున్నార్ (కేరళ)

మున్నార్‌ను దక్షిణ భారతదేశంలోని స్వర్గధామం అంటారు. పచ్చని తేయాకు తోటలు, చల్లని గాలి మరియు అందమైన జలపాతాలు జంటలకు పూర్తిస్థాయిలో అనువైన ప్రదేశమిది. ఇక్కడ చూడడానికి చాలా ఉన్నాయి. అందుకే ఇక్కడికి ఏటా లక్షల మంది పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడికి వచ్చిన తర్వాత ఖచ్చితంగా ట్రెక్కింగ్‌ను ఆస్వాదించాలి.

భూతల స్వర్గం.. కూర్గ్ (కర్ణాటక)

కర్ణాటకలోని కూర్గ్ ప్రకృతి ప్రేమికులకు స్వర్గం కంటే తక్కువ కాదు. ఈ ప్రదేశం దట్టమైన పర్వతాలు, పొగమంచుతో చుట్టబడి ఉంటుంది. జలపాతాలు, ట్రెక్కింగ్ నుండి మొదలుకుంటే కూర్గ్‌లో చేయవలసినవి చాలా ఉంటాయి. మీరు ఇక్కడ సంస్కృతితో పాటు రుచికరమైన ఆహారాన్ని కూడాపూర్తిగా ఆస్వాదించవచ్చు. అక్టోబర్ నుండి మార్చి వరకు ఇక్కడ సందర్శించడానికి ఉత్తమ సమయం. జంటలకు ఈ ప్రదేశం పర్‌ఫెక్ట్ రొమాంటిక్ డెస్టినేషన్ అని చెప్పవచ్చు.


ఊటీ (తమిళనాడు)


ఊటీ దక్షిణ భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ హిల్ స్టేషన్లలో ఒకటి. ఇక్కడి పూల లోయలు, సరస్సులు, ఎత్తైన పర్వతాలు జంటలను ప్రకృతికి దగ్గర చేస్తాయి. ఊటీ సరస్సులో ఇక్కడ బోటింగ్ ఆనందించవచ్చు. అంతే కాకుండా ఇక్కడ అంతకంటే ప్రత్యేకమైన ప్రదేశాలు సందర్శించడానికి ఇక్కడ ఉన్నాయి.

గోకర్ణ పర్ఫెక్ట్ ఆఫ్ కర్ణాటక

కర్ణాటకలోని గోకర్ణం అందమైన సముద్ర తీరానికి మరియు ప్రశాంతమైన వాతావరణానికి ప్రసిద్ధి. ఈ ప్రదేశం గోవా లాగా రద్దీగా ఉండదు, కాబట్టి జంటలు ఇక్కడ ప్రశాంతంగా గడపడానికి వస్తారు. ఓం బీచ్, హాఫ్ మూన్ బీచ్ సందర్శన మీకు చిరస్మరణీయం.









రైతుల కోసం కొత్త ఆవిష్కరణ

- దేశంలోనే తొలిసారి హైడ్రోజన్ ఆధారిత డ్రోన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ఎరువులు చల్లడం, పురుగుమందుల స్ప్రే చేయడానికి రైతులు చాలా ఇబ్బందులు పడుతుంటారు. ఈ క్రమంలో రైతులకు రైతులకు గేమ్‌చేంజర్‌గా మారే అద్భుత అవిష్కరణను హరియాణాలోని ఓ స్టార్టప్ అభివృద్ధి చేసింది. దేశంలోనే తొలిసారిగా స్వదేశీ హైడ్రోజన్ ఆధారిత వ్యవసాయ డ్రోన్‌ను వావ్ గో గ్రీన్ సంస్థ అభివృద్ధి చేసింది. హిసార్‌లో నిర్వహించిన 'కృషి దర్శన్ ఎక్స్‌పో'లో ప్రదర్శించిన ఈ డ్రోన్ వ్యవసాయ రంగ నిపుణులను, రైతులను విపరీతంగా ఆకర్షించింది. ఈ డ్రోన్‌తో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు రానున్నాయి. దీని ద్వారా రైతుల సమయంతో పాటు డబ్బులు కూడా ఆదా అవుతాయని సంబంధిత సంస్థ చెబుతోంది. సాధారణ బ్యాటరీ డ్రోన్లు కేవలం 15 నుంచి 20 నిమిషాలే పనిచేస్తాయి. కానీ, ఈ హైడ్రోజన్ డ్రోన్ ఒక్కసారి ఇంధనం నింపితే ఏకధాటిగా 3 గంటల పాటు గాలిలో ఉండి పురుగుమందుల పిచికారీ చేయడంతో పాటు ఎరువులను చల్లుతుందని 'వావ్ గో గ్రీన్' చెబుతోంది. దీనివల్ల రైతులకు పదేపదే బ్యాటరీ ఛార్జింగ్ చేయాల్సిన తిప్పలు తప్పుతాయని వెల్లడించింది. ఈ డ్రోన్ దాదాపు మూడు గంటలపాటు ఏకధాటిగా ఎగిరే సామర్థ్యంతో పాటు 10 నుంచి 50 కిలోల వరకు లోడ్‌ను మోయగలదని సంస్థ తెలిపింది.



రాజస్థాన్ లో అగ్నిప్రమాదం 8 మంది సజీవదహనం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: రాజస్థాన్‌లో భివాడిలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదంచోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 8 మంది కార్మికులు సజీవ దహనమయ్యారు. మరో ఇద్దరు అందులోనే చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున భివాడిలోని ఓ కెమికల్ ఫ్యాక్టరీలో అకస్మాత్తుగా మంటలు ఎగసిపడ్డాయి. అనంతరం భారీ పేలుళ్లు సంభవించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యగా ఫ్యాక్టరీలో చుట్టుపక్కల వారిని ఖాళీ చేయించారు. ప్రమాద స్థలంలో చిక్కుకున్న ఇద్దరు కార్మికులను రక్షించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని అదనపు జిల్లా మెజిస్ట్రేట్ సుమిత్ర మిశ్రా తెలిపారు.



నేను రాహుల్ వాదిని కాను: అయ్యర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: రా నున్న అసెంబ్లీ ఎన్నికల్లో కేరళలో పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నాయకత్వంపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని తీవ్రంగా విమర్శిస్తూ తాను గాంధేయవాదినే కాని రాహుల్‌వాదిని కానని అయ్యర్ వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టలేదని, ఒకవేళ కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా తనను బయటకు తరిమేస్తే తాను సంతోషంగా బయటకు వెళ్లి ఆయనను వెనుక నుంచి తంతానంటూ అయ్యర్ వ్యాఖ్యానించారు. గాంధీపై నెహ్రూ తిరుగుబాటు చేశారని, అయినప్పటికీ గాంధీ నెహ్రూను ప్రధానిగా ఎంపిక చేశారని అయ్యర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.







ఇండియా పాక్ మ్యాచ్.. మధ్యలోనే వెళ్లిపోయిన నఖ్వీ

టీ20 వరల్డ్‌కప్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై ఇండియా 61 రన్స్ తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే కొలంబోలో జరిగిన ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మోషిన్ నఖ్వీ వచ్చారు. ప్రేమదాస స్టేడియంలోని వీవీఐపీ గ్యాలరీ నుంచి ఆయన మ్యాచ్‌ను వీక్షించారు. శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకేతో కలిసి మ్యాచ్‌ను తిలకించారు. అయితే పాకిస్థాన్ ఛేజింగ్ చేస్తున్న సమయంలో .. స్టేడియం నుంచి నఖ్వీ మధ్యలో వెళ్లిపోయినట్లు వీడియో రిలీజైంది. ఇంకా మ్యాచ్ పూర్తి కాకముందే నఖ్వీ తన గ్యాలరీ నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. 12వ ఓవర్‌లో మొహమ్మద్ నవాజ్ క్యాచ్ అవుట్ కాగానే.. స్టేడియం నుంచి నఖ్వీ వెళ్లిపోయారు. అక్కడి మీడియా కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఐసీసీ చైర్మెన్ జే షాను కలిసేందుకు నఖ్వీ వచ్చినట్లు తెలుస్తున్నా.. ఆ ఇద్దరూ భేటీ అయినట్లు సమాచారం లేదు. శ్రీలంక క్రికెట్‌కు చెందిన అధికారులతో నఖ్వీ భేటీ అయ్యారు. అయితే ఆసియాకప్ సమయంలో దుబాయ్‌లోని స్టేడియం నుంచి వెళ్లిపోవడానికి నఖ్వీ నిరాకరించిన విషయం తెలిసిందే. ఆసియాకప్ ఫైనల్లో ఇండియా గెలిచినా.. నఖ్వీ నుంచి ట్రోఫీని అందుకునేందుకు మనవాళ్లు ఆసక్తి చూపలేదు. కానీ నఖ్వీ మాత్రం ట్రోఫీ అందజేసేందుకు స్టేడియంలోనే ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ట్రోఫీతో వెళ్లిపోయిన నఖ్వీ.. ఇంత వరకు ఆసియాకప్ ట్రోఫీని ఇండియాకు అప్పగించలేదు.

శ్రీలంక చేతిలో ఆస్ట్రేలియా ఓటమి

సూపర్ 8కు దూసుకెళ్లిన లంకేయులు

టీ20 ప్రపంచకప్‌నకు సహ ఆతిథ్యదేశంగా వ్యవహరిస్తున్న శ్రీలంక ఈ టోర్నీలో సూపర్ 8కు దూసుకెళ్లింది. సోమవారం పల్లెకెలె మైదానంలో ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 8 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని నమోదుచేసింది. ఛేదనలో లంక ఓపెనర్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' పతుమ్ నిస్సంక (52 బంతుల్లో 100 నాటౌట్, 10 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఈ టోర్నీలో తొలి శతకాన్ని నమోదుచేయడంతో ఆ జట్టు స్వదేశంలో అత్యధిక ఛేదనను విజయవంతంగా పూర్తిచేసింది. అతడికి తోడు కుశాల్ మెండిస్ (38 బంతుల్లో 51, 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా ట్రావిస్ హెడ్ (29 బంతుల్లో 56, 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ మిచెల్ మార్ష్ (27 బంతుల్లో 54, 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ శతకాలతో 20 ఓవర్లలో 181 పరుగులు చేసింది. లంక బౌలర్లలో దుషాన్ హేమంత (3/37), దుష్మంత చమీర (2/36) కంగారూలను కట్టడిచేశారు. ఆసీస్‌కు ఈ టోర్నీలో ఇది వరుసగా రెండో ఓటమి కాగా ఆ జట్టు సూపర్ 8 రేసు నుంచి అనధికారికంగా నిష్క్రమించినట్టే! నేడు న్యూజిలాండ్, జింబాబ్వే జట్లు తమ ప్రత్యర్థులను ఓడిస్తే గ్రూప్‌బీలో ఆస్ట్రేలియా, గ్రూప్ డీ లో ఆఫ్ఘానిస్థాన్ టోర్నీ నుంచి నిష్క్రమిస్తాయి.



సూపర్ 8కు చేరిన ఇంగ్లండ్

తొలి టీ20 ప్రపంచకప్ ఆడుతున్న యూరోపియన్ దేశం ఇటలీ.. తమ ఫుట్ బాల్ ప్రత్యర్థి ఇంగ్లండ్‌ను ఓడించినంత పనిచేసినా పోరాడి ఓడింది. గ్రూప్‌సీలో భాగంగా సోమవారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బ్యాట్‌తో రాణించిన ఇంగ్లిష్ జట్టు.. 20 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 202 రన్స్ చేసింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' విల్ జాక్స్ (22 బంతుల్లో 53 నాటౌట్, 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), టామ్ బ్యాంటన్ (30) రాణించారు. కలుగమగె (2/41), స్టీవార్ట్ (2/51) తలా రెండు వికెట్లు తీశారు. రికార్డు ఛేదనలో 22 పరుగులకే 3 కీలక వికెట్లు పడిపోయిన ఇటలీ.. బెన్ మనెంటి (25 బంతుల్లో 60, 4 ఫోర్లు, 6 సిక్స్‌లు), జస్టిన్ మోస్కా (34 బంతుల్లో 43) ఎదురుదాడికి దిగడంతో గెలుపు రేసులోకి వచ్చింది. ఈ ద్వయం నాలుగో వికెట్‌కు 48 బంతుల్లోనే 92 రన్స్ జోడించింది. అయితే 12వ ఓవర్లో జాక్స్.. మనెంటిని ఔట్ చేసి ఆ జట్టుకు షాకిచ్చాడు. అతడి స్థానంలో క్రీజులోకి వచ్చిన స్టీవార్ట్ (23 బంతుల్లో 45, 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) వీరవిహారంతో ఇటలీలో మళ్లీ గెలుపు ఆశలు చిగురించాయి. కానీ మూడు పరుగుల వ్యవధిలో 3 కీలక వికెట్లు కోల్పోయిన ఆ జట్టు 20 ఓవర్లలో 178 వద్దే ఆగిపోయింది. ఈ ఓటమితో గ్రూప్‌సీ నుంచి విండీస్, ఇంగ్లండ్ సూపర్ 8 బెర్తులు ఖాయం చేసుకోగా స్కాట్లాండ్, ఇటలీ, నేపాల్ టోర్నీ నుంచి నిష్క్రమించాయి.



మెగా టోర్నీలో ఆఫ్ఘానిస్థాన్‌కు తొలి విజయం

సూపర్ 8 ఆశలు సజీవం

సంచలనాల ఆఫ్ఘానిస్థాన్ టీ20 ప్రపంచకప్ సూపర్ 8 రేసును సజీవంగా ఉంచుకుంది. ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో ఓడి రెండో పోరులో విజయానికి దగ్గరగా వచ్చినా 'సూపర్ ఓవర్' ఫలితంతో నిరాశచెందిన రషీద్ ఖాన్ సేన.. ఎట్టకేలకు తమ మూడో మ్యాచ్‌లో బోణీ కొట్టింది. ఢిల్లీ వేదికగా జరిగిన గ్రూప్‌డీ మ్యాచ్‌లో కాబూలీలు.. 5 వికెట్ల తేడాతో యూఏఈపై గెలిచారు. అజ్మతుల్లా ఒమర్‌జయ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన (మొదట బంతితో 4/15, ఆ తర్వాత బ్యాట్‌తో 21 బంతుల్లో 40 నాటౌట్) తో రాణించి ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. మొదట బ్యాటింగ్ చేసిన యూఏఈ.. నిర్ణీత ఓవర్లకు 160/9కే పరిమితమైంది. సోహైబ్ ఖాన్ (48 బంతుల్లో 68, 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), అలిషాన్ షరాఫు (31 బంతుల్లో 40) ఆ జట్టును ఆదుకున్నారు. ఛేదనలో ఆఫ్ఘాన్ కూడా తడబడింది. గుర్బాజ్ డకౌట్ అవగా జద్రాన్ (41 బంతుల్లో 53) నెమ్మదిగా ఆడాడు. ఆఖరి 3 ఓవర్లలో ఆ జట్టు విజయానికి 28 పరుగుల అవసరమన్న దశలో ఒమర్‌జయ్ మెరుపులు మెరిపించి ఆఫ్ఘాన్‌కు తొలి విజయాన్ని అందించాడు.




కాటాలన్ ఫస్ట్ సాంగ్

హై-ఎనర్జీతో అదరగొట్టిన సునీల్

క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ ముహమ్మద్ నిర్మించిన గ్రాండ్ యాక్షన్ థ్రిల్లర్ కాటాలన్ నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలైంది. పుష్ప, జైలర్ వంటి చిత్రాల ద్వారా ఇప్పటికే మలయాళీ ప్రేక్షకులకు సుపరిచితుడైన తెలుగు స్టార్ సునీల్ ఈ ట్రాక్ లో అదరగొట్టారు. ఐటెం నంబర్‌గా వచ్చిన ఈ పాటలో సునీల్ హైఎనర్జీ డ్యాన్స్ మూమెంట్స్ హైలైట్ గా నిలిచాయి. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరిచిన "మజాకో మల్లికా అనే ట్రాక్‌ను వినాయక్ శశికుమార్ రాశారు. ఆనంద్ శ్రీరాజ్, భద్ర పాడారు. ఇది మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషలలో విడుదలైంది. కాటాలన్ మే 14న భారీ పాన్‌ఇండియా విడుదలకు సిద్ధమవుతోంది. బ్లాక్‌బస్టర్ మార్కో మేకర్స్ నుంచి వస్తున్న ఈ చిత్రానికి కొత్త దర్శకుడు పాల్ జార్జ్ దర్శకత్వం వహించారు. ఇంతకు ముందు విడుదలైన టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది, అద్భుతమైన యాక్షన్ సన్నివేశా, ఇంతకు ముందు ఎన్నడూ చూడని స్టంట్ సన్నివేశాలు అలరించాయి. ఆంటోనీ వర్గీస్ ప్రధాన పాత్రను పోషిస్తున్నారు, దుషార విజయన్, కబీర్ దుహాన్ సింగ్, పుష్ప ఫేమ్ రాజ్ తరందాసు, బాలీవుడ్ నటుడు పార్థ్ తివారీ, మలయాళ నటులు జగదీష్, సిద్ధిక్, వ్లాగర్‌గాయకుడు హనన్ షా, రాపర్ బేబీ జీన్, హిప్జర్ వంటి భారీ తారాగణం ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓంగ్‌బాక్ సిరీస్‌కు ప్రసిద్ధి చెందిన అంతర్జాతీయంగా ప్రఖ్యాత యాక్షన్ డైరెక్టర్ కేచా ఖంఫక్డీ తన బృందంతో కలిసి థాయిలాండ్‌లో యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేశారు. ఓంగ్‌బాక్ చిత్రాల ద్వారా ప్రజాదరణ పొందిన ప్రసిద్ధ ఏనుగు "పాంగ్" కూడా ఈ చిత్రంలో భాగమైయింది.

శివకార్తికేయన్ 'సెయాన్' ఫస్ట్ లుక్

వర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో, కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న కొత్త చిత్రం కోసం చేతులు కలిపారు. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన అమరన్ తర్వాత శివకార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌తో కొలాబరేట్ కావడం విశేషం. విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాన్ని అందుకున్న ఆ చిత్రంతో ఏర్పడిన క్రియేటివ్ జర్నీ ఇప్పుడు మరింత బలపడింది. గ్రాండ్ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి "సెయాన్" అనే శక్తివంతమైన టైటిల్‌ను ఖరారు చేశారు. 2026లో బిగ్గెస్ట్ ఫ్యామిలీ స్పెక్టకిల్‌గా నిలిచేలా ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్, వినోదాన్ని మేళవిస్తూ ఈ సినిమా రూపొందుతోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో శివకార్తికేయన్ డివైన్ ల్లూక్ కనిపిస్తున్నారు. ధోతి, విభూతి, రుద్రాక్షలతో సంప్రదాయానికి దగ్గరగా కనిపిస్తూ, చేతిలో వంపు ఉన్న కత్తి ఆయన ప్రశాంతత వెనుక దాగిన శక్తిని సూచిస్తోంది. వెనుకన కనిపించే నెమలి రెక్కలు, చుట్టూ ఉన్న నెమళ్లు మురుగన్ స్వామి ప్రతీకను గుర్తు చేస్తూ పాత్రకు మిథికల్ ఆరా అందిస్తున్నాయి. ఈ చిత్రంలో శివకార్తికేయన్ పవర్‌ఫుల్, డైనమిక్ పాత్రలో కనిపించనున్నారు. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, శివకార్తికేయన్, ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ కలిసి పనిచేస్తున్న తొలి సినిమా కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేకగా నిలిచింది. తన ప్రత్యేకమైన మ్యూజికల్ స్టైల్‌తో, చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్‌తో పేరుగాంచిన సంతోష్ నారాయణన్ సంగీతం ఈ చిత్రానికి స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది. రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ లెగసీ, టర్మరిక్ మీడియా విజన్ కలిసిన "సెయాన్" 2026లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాలలో ఒకటిగా నిలవనుంది.





ట్రెండింగ్‌లో నాగబంధం టీజర్

24 గంటల్లో 20 మిలియన్లకు పైగా వ్యూస్

దర్శకుడు అభిషేక్ నామా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న చిత్రం "నాగబంధం" పాన్‌ఇండియా స్థాయిలో భారీ సంచలనం సృష్టిస్తోంది. మహాశివరాత్రి సందర్భంగా విడుదలైన ఈ మిస్టికల్ ఎపిక్ టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. కేవలం 24 గంటల్లోనే 20 మిలియన్‌కు పైగా వ్యూస్ సాధించి, దేశవ్యాప్తంగా ట్రెండింగ్ చార్ట్స్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకోవడం ద్వారా పాన్‌ఇండియన్ లో అదరగొట్టింది. ఈ అచీవ్మెంట్ ని మరింత ప్రత్యేకంగా నిలబెట్టేది డైరెక్టర్ అభిషేక్ నామా విజన్. అంతర్జాతీయ స్థాయి విజువల్ స్పెక్టకిల్‌ను అందించారు. ఆయనతో పాటు హీరో విరాట్ కర్ణా, డెబ్యూటెంట్ నిర్మాతలు కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి కలిసి వరల్డ్ క్లాస్ ప్రొడక్షన్ వాల్యూస్ తో నిర్మించారు. టీజర్‌లో ప్రత్యేక హైలెట్ గా నిలిచింది విరాట్ కర్ణా ట్రాన్స్‌ఫర్మేషన్. తన గత ఇమేజ్‌కు పూర్తి భిన్నంగా, శివుని అవతారంలా కనిపించడం, హై ఎనర్జీతో ఆయన చేసిన నటన ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. టెక్నికల్ గా "నాగబంధం" కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేస్తోంది. హై ఎండ్ లు సహజంగా అనిపించేలా ఉండటం, అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్ , అద్భుతమైన సినిమాటోగ్రఫీ టీజర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కథలో ఉన్న భారీ స్కేల్‌ను నిజ జీవిత అనుభూతిగా మార్చేందుకు నిర్మాతలు ఎలాంటి ఖర్చుకూ వెనుకాడలేదని స్పష్టంగా తెలుస్తోంది. టీజర్ హైప్ నుంచి సమ్మర్ రిలీజ్ దిశగా ప్రయాణిస్తున్న ఈ చిత్రం చుట్టూ ఉన్న బజ్ రోజురోజుకీ పెరుగుతోంది. మోడరన్ స్టైల్ లో పురాణ కథనాన్ని చూపిస్తూ, అభిషేక్ నామా, ఆయన టీమ్ ప్రేక్షకుల అంచనాలను నెక్స్ట లెవల్ కి తీసుకెళ్లారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200